ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
సోమవారం 24 మార్చి 2025 | 5



రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6 : 20 (సోమవారం సాయంత్రం)
సహార్ : 4:42 (మంగళవారం ఉదయం)



వైద్యులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి



వస్తా.. వెళ్లొస్తా..

రాజమహేంద్రవరంలో రెండు వంతెనల మధ్య భానుడి చిత్రం అద్భుతం.. అదొక అపురూప ఘట్టం.. ఆ దృశ్యం చూడడానికి రెండు కళ్లూ చాలవు.. ఈ చిత్రంలోనే చూడండి.. ఆదివారం సాయంత్రం భానుడు వెళుతూ వెళుతూ పుష్కరఘాట్‌లో ఉన్న జనాలకు ఇలా చాలా సేపు కనువిందు చేసి వెళ్లాడు. ఇలా కెమెరాకు చిక్కాడు. - ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం

రుషికొండ బీచ్‌కు బ్లూఫాగ్ పునరుద్ధరణ హర్షణీయం

రాష్ట్ర పర్యాటక మంత్రి కందుల దుర్గేష్

రాజమహేంద్రవరం మార్చి 23 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం రుషికొండ బీచ్‌కు బ్లూఫాగ్‌ను పునరుద్ధరించడంపై రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ సంతోషం వ్యక్తం చేశారు.ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.రుషికొండ బీచ్‌కు బ్లూఫ్లాగ్ గుర్తింపు పునరుద్ధరణపై అసెంబ్లీలో ఇచ్చిన మాట నిలబెట్టుకున్నామన్నారు.సీఎం చంద్రబాబు,డిప్యూటీ సీఎం పవన్‌కు ధన్యవాదాలు తెలిపారు.భారత్‌లో బ్లూఫ్లాగ్ గుర్తింపు పొందిన మొదటి ఎనిమిది బీచ్‌లలో రుషికొండ ఒకటన్నారు.

కేన్సర్‌పై తప్పుడు నివేదికలు ఇవ్వొద్దు

వైద్యులతో ఎమ్మెల్యే నల్లమిల్లి సమీక్ష

అనపర్తి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : బిక్కవోలు మండలం బలభద్రపురంలో కేన్సర్ బాధితులను కనుగొనేందుకు నిర్వహిస్తున్న సర్వే పారదర్శకంగా సాగాలని తప్పుడు నివేదికలు ఇచ్చి సమస్య తీవ్రత తగ్గించేందుకు ప్రయత్నించవద్దని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరం వద్ద ఆదివారం ఎమ్మెల్యే వైద్యాధికారులు, వైద్య సిబ్బందితో సర్వేపై సమీక్షించారు. అసెంబ్లీలో కేన్సర్ తీవ్రతపై తాను ప్రస్తావించడంతో సీఎం చంద్రబాబు నాయుడు, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌లు స్పందించి ప్రత్యేక వైద్య శిబిరంతో పాటు సమగ్ర సర్వేకు ఆదేశాలు జారీ చేశారన్నారు.సర్వే జరుగుతుండగానే స్క్రీనింగ్ టెస్టులు లేకుండా బాధితుల సంఖ్య ఎలా నిర్ధారిస్తారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్వే ప్రారంభమైన రోజునే 23 మంది కేన్సర్ రోగులు ఉన్నారని ఉన్నతాధికారులకు ఏవిధంగా నివేదిస్తారని ప్రశ్నించారు. సర్వే పూర్తయ్యేవరకు స్వయంగా తానే పర్యవేక్షిస్తానని తెలిపారు.గ్రామస్తులు ఇంటింటా సర్వేకు వచ్చిన సిబ్బందికి ఆరోగ్యపరమైన సమస్యలను దాచుకోకుండా చెప్పాలని సూచించారు. ఎమ్మెల్యే వెంట డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు, హెచవోడీ పి.సుజాత, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్ పద్మావతి, ఎంపీడీవో ఎం.రామకృష్ణారెడ్డి, మాజీ ఎంపీటీసీ సుబ్బారెడ్డి తదితరులు ఉన్నారు.

నీటి సరఫరాలో ఇబ్బందులుంటే డయల్ 91001 21190

ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ గిరి

రాజమహేంద్రవరం రూరల్ మార్చి 23(ఆంధ్రజ్యోతి): రానున్న వేసవి దృష్ట్యా జిల్లాలో తాగునీటి సరఫరాకు ఎటువంటి ఆటంకం రాకుండా తగు చర్యలు చేపడుతున్నట్టు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బీవీ.గిరి ఒక ప్రకటనలో తెలిపారు.గ్రామీణ ప్రాంతాల్లో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడితే 91001 21190 నెం బరుకు ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు ఫిర్యాదు చేయ్యవచ్చన్నారు. జిల్లాలో 141 హ్యాండ్ పంపులు,59 సూక్ష్మ నీటి సరఫరా పథకాలు మరమ్మతులు చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా 18 మండలాల పరిధిలోని 482 నివాస ప్రాంతాలకు చెందిన 14.74 లక్షల మందికి ఆర్‌డబ్ల్యూఎస్ ద్వారా తాగునీరు సరఫరా చేయడం జరుగుతుందన్నారు.ఈ మేరకు 2,116 చేతి పంపులు, 308 సూక్ష్మ రక్షిత నీటి సరఫరా పథకాలు,601 ప్రజానీటి సరఫరా పథకాలు 5 సామాజిక ప్రజా నీటి సరఫరా పథకాలు జిల్లాలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. గోదావరి నుంచి నీటిని సరఫరా చేయాలని ప్రతిపాదనలు వచ్చాయన్నారు. కేంద్ర ప్రాయోజిత కార్యక్రమం జల్‌జీవన్ మిషన్ ప్రాజెక్టుల కింద నాలుగు స్థానాలను గుర్తించడం జరిగిందన్నారు. కాకినాడ నుంచి కోనసీమ జిల్లాల్లో కొంత భాగంతో పాటు రాజమహేంద్రవరం రూరల్, కడియం బిక్కవోలు, అనపర్తి మండలాలను కవర్ చేసే విధంగా ధవళేశ్వరం వద్ద రూ.1650 కోట్ల అంచనా, విజ్జేశ్వరం వద్ద పశ్చిమ గోదావరి జిల్లాలోని కొన్ని ప్రాంతాలతో పాటు, ఉండ్రాజవరం, పెరవలి, నిడదవోలు, చాగల్లు, కొవ్వూరు, తాళ్ళపూడి మండలాల్లో రూ. 1400 కోట్ల వ్యయంతో రెండు పనులకు సంబంధించి టెండర్లు పిలిచారన్నారు. వచ్చే నెలలో పనులు ప్రారంభమవుతాయన్నారు. భవిష్యత్‌లో అన్ని మండలాలకు గోదావరి నీరందించేందుకు ప్రణాళిక రూపొందించినట్టు తెలిపారు.

గోదారి.. గొంతు తడారి!



మంచినీళ్లకు వెళుతున్న రాజమండ్రి మహిళలు

గోదావరి చెంతనే ఉన్నా ప్రజల గొంతు తడారిపోతోంది.. గుక్కెడు నీటికి ఎన్నో ఇబ్బం దులు.. ఇదీ ఇటు రాజమహేంద్రవరం.. అటు కొవ్వూరు పరిస్థితి.వేసవి ఆరంభంలోనే ప్రజలు దాహం కేకలు వేస్తున్నారు. దశాబ్ద కాలంగా అన్ని ప్రాంతాలకు గోదావరి జలాలను అందిస్తామని ప్రభుత్వాలు చెబుతూనే ఉన్నాయి. నేటికీ ఆ ప్రతిపాదనలు అమలులోనే ఉన్నాయి. కనీసం గోదావరి చెంతనే ఉన్న ప్రాంతాలకు నదీజలాలు అందడం లేదు. మిగిలిన ప్రాంతాలకు పైపులైను వేసి ఎప్పటికి అందిస్తారో ఆలోచించాల్సిందే మరి.

- సక్రమంగా అందని తాగునీరు
- వేసవి ఆరంభంలోనే ఇక్కట్లు
- గోదారి చెంతనే దాహం కేకలు
- రాజమండ్రిలో శివారున ఇక్కట్లు
- కొవ్వూరుకు అందనే అందవు
- దశాబ్దాలుగా హామీలతోనే సరి
- దేవరపల్లిలో నీటికి ఆందోళన

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం శివారు ప్రాంతాలకు తాగునీటి ఇబ్బందులు తప్పడంలేదు. అటువంటి ప్రాంతాలకు నగరపాలక సంస్థ వాటర్ ట్యాంకర్ల ద్వారా తాగునీరందిస్తున్నారు.నగరంలో ఆనంద్‌నగర్, టీచర్స్ కాలనీ, వెంకటాపురం శివారు ప్రాంతాలు, క్వారీలోని సింహాచల్ నగర్,9వ డివిజన్‌లో వెంకటేశ్వనగర్, బర్మాకాలనీల్లో కొంత సమస్యవుంది. వెంకటేశ్వరనగర్‌లో వాటర్ ట్యాంక్ పనులు పూర్తి చేస్తే నీటి సమస్య అధిగమించవచ్చు. మిగిలిన చోట్లకు నగరపాలక సంస్థ వాటర్ ట్యాంకర్లతో నీరు సరఫరా చేస్తున్నారు.ఈ వేసవిలో నీటి ఎద్దడిని అదిగమించేందుకు నగరపాలక సంస్థ కసరత్తు చేస్తుంది.మిగిలిన ప్రాంతాల ప్రజలకు తాగునీటి ఇబ్బందుల్లేకుండా రోజుకు రెండు పూటలా కార్పొరేషన్ అధికారులు నీటిని సరఫరా చేస్తున్నారు. నగరంలో 50 డివిజన్లలో సుమారు 5 లక్షల మంది జనాభా ఉన్నారు.75 వేల గృహాలు,20 వేల వ్యాపార సంస్థలు ఉన్నాయి. నగరంలో ప్రధాన మంచినీటి విభాగం ద్వారా 50 ఎంఎల్‌డీ వాటర్, టింబర్ యార్డులో ఉన్న 10 ఎంఎల్‌డీ వాటర్ ప్లాంట్ నుంచి, ఆల్‌కట్ గార్డెన్స్ శివారు ధవళేశ్వరం రోడ్డులో ఉన్న మరొక 10ఎంఎల్‌డీ వాటర్ ప్లాంట్‌ల ద్వారా 20 ఎంఎల్‌డీ వాటర్ కలిసి మొత్తం 74.742 ఎంఎల్‌డీ వాటర్‌ను తయారు చేస్తున్నారు. దీనికి అలమ్, క్లోరినేషన్, ఫిల్టర్‌బెడ్ తదితర ప్రక్రియలు పూర్తిచేసి ప్రజలకు సరఫరా చేయడానికి నగరపాలక సంస్థకు ఏడాదికి రూ.20 కోట్లు ఖర్చవుతుంది. నగరపాలక సంస్థకు నీటి చార్జీల రూపేణా వచ్చే ఆదాయం రూ.12 కోట్లు .నగరంలో ప్రతి వ్యక్తికి సగటున రోజుకు 130 లీటర్ల తాగునీరు సరఫరా చేస్తున్నారు. నగరపరిధిలో రెండు పూటల తాగునీరందిస్తున్నారు. నగర శివారు ప్రాంతాల్లో మాత్రం నేటికీ తాగునీటి ఎద్దడి కనిపిస్తుంది.

కొవ్వూరుకు బోరు నీరే ఆధారం

కొవ్వూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : అఖండ గౌతమి గోదావరి కొవ్వూరు పట్టణాన్ని ఆనుకుని ఉంది. ఎక్కడో మహారాష్ట్రలోని నాసిక్ వద్ద పుట్టిన గోదావరి నది వేల కిలోమీటర్లు ప్రవహించి కొవ్వూరు చేరుకుంటుంది. ఇక్కడ నుంచి అఖండ గోదావరి ఏడుపాయలు గా విడిపోయి ఉభయ గోదావరి జిల్లాల్లోని లక్షలాది ఎకరాలకు సాగునీరు, లక్షలాది మందికి తాగునీటిని అందిస్తూ ఎంతో మంది అవసరాలు తీరుస్తుంది. అయితే పాలకులు అఖండ గోదావరి ఒడ్డున ఉన్న కొవ్వూరు తీరాన్ని మాత్రం మర్చిపోయారు.కొవ్వూరు నియోజకవర్గం ఏర్పడి 6 దశాబ్దాలు దాటుతున్నా నేటికి పట్టించుకున్న పాలకులు లేరు. దీంతో వేసవి వచ్చిందంటే ప్రజలు గుక్కెడు నీటికి ఇక్కట్లు పడుతూనే ఉన్నారు. కొవ్వూరు పట్టణంలో సుమారు 50 వేలకు పైగా జనాభా ఉన్నారు. నియోజకవర్గంలో 53,000 ఎకరాల సాగుభూమి ఉంది. గోదారి చెంతనే ఉన్నా తాగు, సాగు నీటికి బోరు నీరే ఆధారం. కొవ్వూరు పట్టణంలో 12,569 గృహాలు, 50 వేలకు పైగా జనాభా ఉన్నారు. వీరికి పురపాలక సంఘం ప్రతి రోజు రెండుపూటలా పట్టణంలో 4.5 ఎంఎల్‌డీ తాగునీటిని సరఫరా చేస్తుంది. ఒక్కొక్క పూటకు 22.50 లక్షల లీటర్ల నీటిని సరఫరా చేస్తున్నారు. పట్టణంలో కుళాయి పన్నుల రూపంలో మునిసిపాలిటీకి రూ.57 లక్షలు ఆదాయం వస్తుండగా ప్రజలకు తాగునీరందించడానికి ఏడాదికి సుమారు రూ. 2.03 కోట్లు ఖర్చు చేస్తున్నారు. వేసవిలో 15వ వార్డు బ్రిడ్జిపేట, ఒకటో వార్డు ఆర్టీసీ కాలనీలతో పాటు ఇటీవల వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన జగనన్న కాలనీలకు తాగునీటి ఎద్దడి తప్పడం లేదు. దీంతో మునిసిపల్ వాటర్ ట్యాంకుతో పాటు, 4 ట్యాంకర్లను అద్దెకు తీసుకుని పట్టణంలోని 4 జగనన్నకాలనీలకు నీటిని సరఫరా చేస్తున్నారు. కొత్త ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణంతో ఏఐబీ పథకంలో చేపట్టిన తాగునీటి పథకాన్ని పూర్తిచేస్తే తాగునీటి సమస్య తీరుతుంది.



కొవ్వూరు 1వ వార్డుకు ట్యాంకర్ల ద్వారా నీరు

గోదావరి నీరు సరఫరాకు చర్యలు

కొవ్వూరు పట్టణ ప్రజలకు గోదావరి జలాలను అందించేందుకు రూ.58 కోట్లతో పనులు చేపట్టాం.బిల్లులు మంజూరుకాకపోవడంతో కాంట్రాక్టర్ పనులు మధ్యలోనే నిలుపుదల చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం పెరిగిన ధరలు రూ. 70 కోట్లతో ప్రతిపాదనలు తయారుచేసి ప్రభుత్వానికి పంపించడం జరిగింది. పరిపాలన అనుమతులు మంజూరయ్యాయి.టెండర్లు పూర్తయిన వెంటనే పనులు ప్రారంభిస్తాం.

- టి.నాగేంద్రకుమార్,కమిషనర్, కొవ్వూరు

తాగునీటికి రోడ్డెక్కారు!

దేవరపల్లి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : తాగు నీరివ్వాలని రోడ్డెక్కారు.. ఆందోళన చేశారు. దేవర పల్లిలో ఇందిరమ్మ కాలనీకి గత వారం రోజు లుగా నీరందకపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.దీంతో ఆదివారం మహిళలు భారీ ఎత్తున రోడ్డు పైకి వచ్చి ఖాళీ బిందెలతో నిరసన చేపట్టారు. వీరికి మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు సుంకర దుర్గారావు మద్దతుగా నిలిచి పంచాయతీ అధికారులను నిల దీశారు.దేవరపల్లి మండలంలో తాగునీటికి ఎప్పు డు సమస్యలేదని.. ఇందిరమ్మ కాలనీలో 40 వేల లీటర్ల వాటర్ ట్యాంకు ఉందని తెలిపారు. కావాలని నీటి సమస్య సృష్టిస్తున్నారని ఆరోపించారు.ఎస్ఐ సుబ్రహ్మణ్యం సంఘటన ప్రాంతానికి చేరుకుని కాలనీవాసులకు నచ్చ జెప్పారు.తాగునీరు సక్రమంగా సరఫరా చేయాలని కార్యదర్శి ఎన్.రవికిషోర్‌కు సూచించారు.




27న ఉపసర్పంచ్‌ల ఎన్నిక

- 35 పంచాయతీల్లో ఖాళీలు
- ఉమ్మడి జిల్లాలో ఇదీ లెక్క
- పల్లెల్లో ఎన్నికల సందడి

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)
మళ్లీ ఎన్నికల సందడి మొదలైంది. స్థానిక సంస్థల ఎన్నిక జరిగి నాలుగేళ్ల పూర్తికావడంతో పలు చోట్ల అభ్యర్థుల మార్పులు అవిశ్వాస తీర్మానాలు ఆరంభంకానున్నాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు డివిజన్లలో మొత్తం 35 పంచాయతీల్లో ఖాళీ అయిన ఉపసర్పంచ్ పదవులకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఆయా పంచాయతీల పరిధిలోని వార్డు సభ్యులకు నోటీసులు ఇచ్చారు. 27న ఈవోపీఆర్‌డీ ఎన్నికల అధికారిగా ఆయా పంచాయతీల్లో ఎన్నికలు నిర్వహిస్తారు.కూటమి అధికారంలోకి ఉండడంతో ఉపసర్పంచ్ పదవులు కైవశంచేసుకోవాలనే వ్యూహంతో వ్యవహరిస్తోంది.

- తూర్పుగోదావరి జిల్లాలో 12 ఉపసర్పంచ్ పదవులకు ఎన్నికలు జరగనున్నాయి.గోకవరం మండలం మల్లవరం, కొవ్వూరు మండలం పెనకనమెట్ట, రాజానగరం మండలం పాతతుంగపాడు, గోపాలపురం మండలం కొవ్వూరుపాడు,గోపాలపురం,వెంకటాయపాలెం, తాళ్ళపూడి మండలం తాడిపూడి, అనపర్తి మండలం లక్ష్మీనరసాపురం,రంగంపేట మండలం మర్రిపూడి, కడియం మండలం మురమండ,సీతానగరం మండలం మునికూడలి,ఉండ్రాజవరం గ్రామాల్లో ఉపసర్పంచ్ ఎన్నికలు జరుగనున్నాయి.
- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఆత్రేయపురం మండలం పులిదిండి, రాయవరం మండలం వెదురుపాక, రాయవరం, ఐ.పోలవరం మండలంలో జి.మూలపొలం,ముమ్మిడివరం మండలం సిహెచ్.గున్నేపల్లి, రాజోలు మండలం సోంపల్లి, శివకోటి, ఆలమూరు మండలం మొదుకూరు, కొత్తపేట మండలం కొత్తపేట, పలివెల, మలికిపురం మండలం లక్కవరం,చింతలమోరి, సఖినేటిపల్లి మండలంలో మోరిపాడు, అంతర్వేదిపాలెం, అంబాజీపేట మండలంలో మాచవరం, అల్లవరం మండలంలో ఎంట్రికోన, అయినవిల్లి మండలంలో బోతుకుర్రు, రామచంద్రపురం మండలం నెలపర్తిపాడు పంచాయతీల్లో ఉపసర్పంచ్ పదవులకు ఎన్నికలు జరుగనున్నాయి.
- కాకినాడ జిల్లాలో పెదపాడు మండలం రామేశ్వరం,తుని పరిధిలో దొండవాక,సామర్లకోట మండలం బి.వేమవరం, తొండంగి మండలం పైడికొండ,ప్రత్తిపాడు మండలం పెదశంకర్లపూడి పంచాయతీల పరిధిలో ఉపసర్పంచ్ ఎన్నికలు జరుగనున్నాయి.

నేటి నుంచి పొగాకు కొనుగోళ్లు ప్రారంభం



దేవరపల్లి,మార్చి 23 (ఆంధ్రజ్యోతి): దేవరపల్లి పొగాకు వేలం కేంద్రంలో పొగాకు కొనుగోళ్లు సోమవారం ప్రారంభిస్తున్నట్లు దేవరపల్లి పొగాకుబోర్డు వేలం నిర్వహణాధికారి హేమస్మిత ఆదివారం తెలిపారు. పొగాకు బోర్డు ఈడీ బీ.విశ్వశ్రీ పొగాకు కొనుగోళ్లు ప్రారంభిస్తారని తెలిపారు.గతేడాది లైట్‌శాయిల్ 3038, బ్లాక్ శాయిల్ రైతులు 1059 మంది ఉన్నారని లైట్‌శాయిల్ పొగాకు రూ.390 పలకగా, లైట్‌శాయిల్ పొగాకు రూ.401 అత్యధిక ధర పలికిందన్నారు. సరాసరి ధర రూ.315 పలికినట్టు తెలిపారు. ఈ ఏడాది పొగాకు ధరలు ఆశాజనకంగా ఉందన్నారు. మొదటి రోజైన సోమవారం చెరుకుమిల్లి గ్రామానికి చెందిన రైతులు 27 బేళ్ళు అమ్మకానికి పెడతారని తెలిపారు. రైతులంతా ప్రారంభోత్సవానికి రావాలన్నారు.

వేస్ట్ కాదు సుమా!





ఈ నెల 8న కాపవరంలో పరిశీలించిన మంత్రి నారాయణ

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)
ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా అనేక మునిసిపాలిటీల్లో వందల టన్నుల చెత్త సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా కూటమి ప్రభుత్వం సరికొత్త అడుగులు వేస్తోంది. నిత్యం వచ్చే వందల టన్నుల చెత్తను ఒక చోటకు చేర్చి దీని నుంచి విద్యుదుత్పత్తి చేసే ప్రాజెక్టుకు రూపకల్పన చేస్తోంది.అటు జనానికి చెత్త సమస్య తీర్చడం..ఇటు కొండల్లా పోగయ్యే చెత్తను కనుమరుగు చేసి ప్రజలకు ఉపయోగపడేలా విద్యుదుత్పత్తి చేసేలా రూ.370 కోట్లతో చెత్త నుంచి విద్యుత్ తయారీ యూనిట్ నెలకొల్పబోతోంది. కాకినాడ-రాజమహేంద్రవరం క్లస్టర్‌లో దీని ఏర్పాటుకు వీలుగా ప్రైవేటు సంస్థలను ఆహ్వానించింది. అనపర్తి నియోజకవర్గంలోని బిక్కవోలు మండలం కాపవరం, బలభద్రపురంలో గ్రామాల్లో ప్రాజెక్టుకు స్థలాలు గుర్తించడంతో ఇప్పుడు కొత్త సమస్య వచ్చి పడింది. ఇప్పటికే ఇక్కడ జనం గ్రాసిం కంపెనీ కాలుష్యంతో ఇబ్బంది పడుతుంటే చెత్తంతా ఇక్కడకు తేవడం సరికాదని స్థానిక ఎమ్మెల్యే నల్లమిల్లి, అటు జనం వ్యతిరేకిస్తున్నారు. పెద్దాపురంలో స్థలం అనువుగా ఉన్నా ఎందుకు ఇక్కడే అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రోజుకు 950 టన్నుల చెత్త..

ఉమ్మడి తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాల్లో 22 కార్పొరేషన్లు, మునిసిపాలిటీలను కలిపి కాకినాడ- రాజమహేంద్రవరం క్లస్టర్‌గా ప్రభుత్వం ప్రతిపాదించింది. కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల్లో కార్పొరేషన్లు, మునిసిపాలిటీలు 12 ఉన్నాయి. ఉభయ గోదావరి జిల్లాల్లో కలిపి రోజుకు 950 టన్నుల చెత్త ఉత్పత్తి అవుతుంది.అత్యధికంగా ఉమ్మడి తూర్పు నుంచి ఉత్పత్తి అవుతుంది. కాకినాడ కార్పొరేషన్‌లో రోజుకు 144 టన్నులు, రాజమహేంద్రవరం కార్పొరేషన్ 160, పిఠాపురం 26, పెద్దాపురం 25, సామర్లకోట 23, రామచంద్రపురం 23, మండపేట 26, ముమ్మిడివరం 11,అమలాపురం మునిసిపాలిటీలో 30,కొవ్వూరు, నిడదవోలు మునిసిపాలిటీల పరిధిలో టన్నుల కొద్దీ చెత్త రోజువారీ వస్తోంది.ఈ చెత్తం టినీ ఒక చోట చేరిస్తే రోజుకు 12 మెగా వాట్ల విద్యుదుత్పత్తి చేయవచ్చని అధికారులు తేల్చారు.

ప్లాంట్ ఖర్చంతా ప్రైవేటుదే..

12 మెగావాట్ల విద్యుదుత్పత్తి ప్లాంట్‌కు రూ. 370 కోట్ల వరకు ఖర్చవుతుంది. ఒక్క పైసా పెట్టుబడి పెట్టకుండా ప్రైవేటు కంపెనీయే భరించేలా ఇటీవల ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.ఈ మేరకు టెండర్లు పిలిచింది. ఎంపికైన సంస్థ ఈ మొత్తం భరిస్తే ప్రభుత్వం తరపున చెత్త ఇవ్వడం, ఉత్పత్తయిన విద్యుత్ 25 ఏళ్ల పాటు సదరు కంపెనీయే సొంతంగా విక్రయించుకునే వెసులుబాటు కల్పించింది. ప్రభుత్వానికి ఏ మాత్రం భారం లేకుండా రెండు కార్పొరేషన్లు, 10 మునిసిపాలిటీల్లో చెత్తంతా బయటకు వెళ్లిపోనుంది.ఈ ప్రాజెక్టు ఆరంభమైతే 22 కార్పొరేషన్లు, మునిసి పాలిటీల్లో చెత్త సమస్యకు చెక్ పడనుంది.ఈ ప్రాజెక్టుకు అనపర్తి నియోజకవర్గం బిక్కవోలు మండలం కాపవరంలో 12 ఎకరాలు,బలభద్రపురంలో 20 ఎకరాలను అధికారులు ఎంపిక చేశారు.12 ఎకరాల్లో విద్యుత్ ప్లాంట్, 20 ఎకరాల్లో చెత్తంతా వేసి విద్యుదుత్పత్తికి అనువుగా మార్చడం చేయనున్నారు.ఈ నెల 8న మునిసిపల్ శాఖ మంత్రి నారాయణ కూడా ఆ ప్రాంతాన్ని పరిశీలించారు.

చెత్తతో విద్యుత్ వెలుగు

- చెత్త నుంచి విద్యుదుత్పత్తి
- రూ.370 కోట్లతో ప్లాంట్
- బిక్కవోలులో ఏర్పాటుకు ఓకే
- టెండర్లు పిలిచిన సర్కారు
- ప్రైవేటు భాగస్వామ్యంతో నిర్వహణ
- 22 మునిసిపాలిటీల నుంచి చెత్త
- ఉభయగోదావరి జిల్లాలకు ఇక్కడే
- రోజుకు 950 టన్నులు
- 12 మెగావాట్ల విద్యుదుత్పత్తి
- ప్రజల తీవ్ర అభ్యంతరం
- గ్రాసిం పరిశ్రమతోనే ఇబ్బందులు

ప్రాజెక్టుపై వ్యతిరేకత..

ప్రతిపాదిత ప్రాజెక్టు ప్రదేశంపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి.కాపవరం, బలభద్రపురం గ్రామాల్లో 22 కార్పొరేషన్లు, మునిసిపాలిటీల నుంచి తెచ్చిన చెత్తంతా వేస్తే జనం ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతింటుందని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. నిత్యం ఊరు చుట్టూ వందల్లో చెత్త లారీలు తిరిగితే జనం ఇబ్బందులు పడతారని అంటున్నారు. ఇప్పటికే గ్రాసిం పరిశ్రమ కాలుష్యంతో నరక యాతన పడుతున్న జనానికి ఇది మరో ముప్పు అని ధ్వజమెత్తుతున్నారు. అటు చెత్త నుంచి విద్యుదుత్పత్తి ప్లాంట్ ఏర్పాటు చేయవద్దంటూ కాపవరం, బలభద్రపురం పంచాయతీలు సైతం ఏకగ్రీవ తీర్మానం చేశాయి. ఈ ప్రాజెక్టుకు అనువైన భూమి పెద్దాపురంలో గుర్తించిన అధికారులు మళ్లీ బిక్కవోలు వైపు చూడడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కాపవరం,బలభద్రపురానికి సమీపంలో చెత్త నుంచి తయారయ్యే విద్యుత్ గ్రిడ్‌కు అనుసంధానించుకునేలా విద్యుత్‌లైన్ ఉండడం వల్ల మొగ్గచూపుతున్నట్టు అధికారులు చెబుతున్నారు.

దొంగలు దొరికారు!

● బైక్ దొంగతనాలకు పాల్పడిన ఇద్దరిని అరెస్ట్ చేసిన రాజమహేంద్రవరం పోలీసులు

● రూ.16 లక్షలు విలువ చేసే 31 ద్విచక్ర వాహనాల స్వాధీనం



రాజమహేంద్రవరంలో 31 బైక్‌లు, దొంగలతో డీఎస్పీ రమేష్ బాబు, సీఐ బాజీలాల్

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరి, కృష్ణా జిల్లాల్లో బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు బైక్ దొంగలను తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ప్రకాష్‌నగర్ పోలీసులు పట్టుకున్నారు. ఆదివారం పోలీస్ స్టేషన్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో సెంట్రల్ జోన్ డీఎస్పీ కె.రమేష్ బాబు మాట్లాడారు. ప్రకాష్‌నగర్ సీఐ బాజీలాల్ ఆధ్వర్యంలో ఎస్ఐ ఎస్.శివ ప్రసాద్, క్రైమ్ కానిస్టేబుల్స్ కె.ప్రదీప్‌కుమార్, ఎస్.వీరబాబు, వి.శివ ప్రసాద్‌లు.. బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న నల్లజర్ల మండలం వడ్లమూడి గ్రామానికి చెందిన తూర్ల సోమయ్యను, అతడు దొంగిలించిన బైక్‌లను కొనుగోలు చేస్తున్న నల్లజర్ల మండలం జగన్నాథపురానికి చెందిన చీర్ల కిషోర్‌ను అదుపులోకి తీసుకున్నారని చెప్పారు. సోమయ్య 3 నెలలుగా రాజమహేంద్రవరంలోని మంగళవారపుపేటలో ఇల్లు అద్దెకు తీసుకుని చుట్టుపక్కల తిరుగుతూ బైక్ దొంగతనాలు చేస్తున్నాడు. అతడు ప్రకాష్‌నగర్ పరిధిలో 9, త్రీటౌన్ పరిధిలో 9, వన్‌టౌన్ పరిధిలో 3, నల్లజర్ల పోలీస్ స్టేషన్ పరిధిలో 2, కోరుకొండ స్టేషన్‌పరిధిలో 1, ఏలూరు స్టేషన్ పరిధిలో 3, విజయవాడలో 1 బైక్‌ను దొంగించాడు. అతడిపై ఆయా స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. రాజమహేంద్రవరం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద బైక్ దొంగతనం చేస్తుండగా అరెస్టు చేసి విచారించగా అతడి వద్ద రూ.16లక్షలు విలువ చేసే 31 బైక్‌లు ఉన్నట్టు గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ చెప్పారు. ఈ కేసును ఛేదించిన సీఐ, ఎస్ఐ, క్రైమ్ కానిస్టేబుళ్లను జిల్లా ఎస్పీ నరసింహకిషోర్ అభినందించారని డీఎస్పీ తెలిపారు.

తిమ్మాపురంలో బైక్ దొంగ అరెస్ట్

18 బైక్‌లు స్వాధీనం

సర్పవరం జంక్షన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): చెడు వ్యసనాలబారిన పడిన నిందితుడు కష్టపడకుండా సులువుగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశ్యంతో బైక్‌ల చోరీ బాట పట్టి ఎట్టకేలకు పోలీసులకు చిక్కాడు. ఆదివారం కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం తిమ్మాపురం పోలీస్‌స్టేషన్‌లో విలేకర్ల సమావేశంలో ఈ వివరాలను రూరల్ సర్కిల్ సీఐ డీఎస్ చైతన్యకృష్ణ వివరించారు. ఉప్పాడ కొత్తపల్లి మండలం బొండపల్లి ఏసుకుమార్ అనే వ్యక్తి లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. చెడు వ్యసనాలకు అలవాటు పడి బైక్‌ల చోరీల బాటపట్టాడు. ఇంటి ఆవరణ, పబ్లిక్ స్థలాలు, రోడ్డు పక్కన పార్కింగ్ చేసిన బైక్ లాక్‌లను ఎంతో చాకచక్యంగా మారుతాళాలతో తొలగించి బైక్‌లను ఎత్తుకుపోయి అమ్మేస్తున్నాడు. బైక్ పోగొట్టుకున్న బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఎస్‌డీపీవో దేవరాజ్ మనీష్ పాటిల్ నేతృత్వంలో రూరల్ సర్కిల్ సీఐ చైతన్యకృష్ణ, తిమ్మాపురం పోలీసులు, క్రైం పార్టీ సిబ్బంది నిందితుడి కోసం దర్యాప్తు చేస్తున్నారు. అయితే ముందస్తు సమాచారం మేరకు తిమ్మాపురం పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తోండగా తిమ్మాపురం వై జంక్షన్ నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా, వేర్వేరు పోలీస్‌స్టేషన్ల పరిధిలో 18 బైక్‌ల దొంగతనం చేసినట్టు వెలుగులోకి వచ్చిందని సీఐ చైతన్యకృష్ణ తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేసి 18 బైక్‌లతో పాటూ, బొమ్మూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో దివాన్‌చెరువులో చోరీ చేసిన 2బంగారు ఉంగరాలు, ఓ చైన్‌ని స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడు చిన్నతనంలో తల్లి మరణించడంతో తండ్రి పర్యవేక్షణ సరిగా లేకపోవడంతో చెడు వ్యసనాల బాట పట్టాడన్నారు. నిందితుడిపై పెద్దాపురం, భీమవరం టూటౌన్‌లో -2, కాకినాడ పోర్టు, తుని టౌన్‌లో -2, కాకినాడ టూటౌన్ క్రైం పీఎస్‌లో 3, అమలాపురం టౌన్ పీఎస్‌లలో 10 కేసులు ఉన్నట్టు తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేసి, బైక్‌లను స్వాధీనం చేసుకున్న అధికారులు, సిబ్బందిని ఎస్‌డీపీవో దేవరాజ్ మనీష్ పాటిల్ అభినందించారు. సమావేశంలో తిమ్మాపురం స్టేషన్ ఎస్‌హెచ్‌వో, ట్రైనీ ఐపీఎస్ సుస్మిత, ఎస్ఐ ఎంవీవీ రవీంద్రబాబు ఉన్నారు.



నిందితుడు, 18 బైక్‌లతో సీఐ చైతన్యకృష్ణ, తిమ్మాపురం ఎస్‌హెచ్‌వో, ట్రైనీ ఐపీఎస్ సుస్మిత

ముంబై ఇండియన్స్‌లో... మనోడు మెరిశాడు!

ఐపీఎల్‌లో ఆడిన కాకినాడకు చెందిన సత్యనారాయణ రాజు



సత్యనారాయణ రాజు

(కాకినాడ - ఆంధ్రజ్యోతి)

కాకినాడకు చెందిన ఫాస్ట్ బౌలర్ పెన్మత్స సత్యనారాయణ రాజుకు ఐపీఎల్‌లో ఆడే అవకాశం దక్కింది. ముంబై ఇండియన్స్ జట్టులో బౌలర్‌గా చోటు దక్కించున్నాడు. ఆదివారం చెన్నై సూపర్ కింగ్స్, ముంబై ఇండియన్స్ మధ్య జరిగిన మ్యాచ్‌లో సత్యనారాయణ ఆడడంతో ఆయన కుటుంబసభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. కాకినాడలోని వారి ఇంటిలో కుటుంబసభ్యులు, బంధువులు ఆ మ్యాచ్‌ను ఆసక్తిగా తిలకించారు. ఫాస్ట్ బౌలర్ అయిన సత్యనారాయణ రాజు దేశవాలీ లీగ్లో సత్తా చాటాడు. రంజీ పోటీల్లో ఎనిమిది మ్యాచ్‌లలో 17 వికెట్లు తీసి అందరి దృష్టి ఆకర్షించాడు. ఈ నేపథ్యంలోనే అతడు ముంబై ఇండియన్స్ జట్టుకు ఎంపికైనట్టు ఆయన తండ్రి రమేష్ తెలిపారు. ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్ వంటి పెద్ద జట్టులో చోటు దక్కడం చాలా ఆనందంగా ఉందని వెల్లడించారు.



టీవీలో ఐపీఎల్‌ను తిలకిస్తున్న సత్యనారాయణ రాజు కుటుంబసభ్యులు, స్నేహితులు

రొమ్ము క్యాన్సర్ శస్త్రచికిత్సలపై వర్క్‌షాపు

జీజీహెచ్ (కాకినాడ), మార్చి 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్‌లోని సర్జరీ విభాగంలో ఆదివారం రొమ్ము క్యాన్సర్ శస్త్రచికిత్సలపై వర్క్‌షాపు జరిగింది. సర్జరీ హెచ్‌వోడి డాక్టర్ ఎస్.శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన వర్క్‌షాపుకు ముఖ్యఅతిథిగా డీఎంఈ, డాక్టర్ ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్శిటీ వీసీ, ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం హాజరయ్యారు. ఇలాంటి వర్క్‌షాపులు మరిన్ని జరగాలని తద్వారా వైద్య విద్యార్థులకు శస్త్రచికిత్సా విధానాలపై మరింత పట్టు సాధించడానికి అవకాశం ఉంటుందన్నారు. కాకినాడతో సహా రాజమహేంద్రవరం, అమలాపురం, విశాఖపట్నం, శ్రీకాకుళం వైద్య కళాశాలలకు చెందిన పీజీ వైద్య విద్యార్థులు హాజరయ్యారు. సర్జరీ వైద్య నిపుణులు రొమ్ము క్యాన్సర్‌కు సంబంధించిన ఆపరేషన్లను ప్రత్యక్ష ప్రసారం ద్వారా విద్యార్థులకు బోధించారు. క్యాన్సర్ నిపుణులు డాక్టర్ సౌమ్య, డాక్టర్ ప్రశోబ్, డాక్టర్ నరేంద్ర బోధకులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి, ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ విష్ణువర్ధన్, ఆర్థోపెడిక్ హెచ్‌వోడి డాక్టర్ ఎంపీఆర్ విఠల్, డాక్టర్ కె.బాబ్జి, డాక్టర్ పి.వెంకటబుద్ధా, డాక్టర్ రవికమల్, డాక్టర్ వెంకటరెడ్డి, డాక్టర్ శైలజారాణి, డాక్టర్ శివరామకృష్ణ, డాక్టర్ మైథిలిదేవి, డాక్టర్ శైలజా హాజరయ్యారు.

సామర్లకోటలో ఉత్సాహంగా...

రాష్ట్ర స్థాయి ఎడ్ల పరుగు ప్రదర్శన పోటీలు

సీనియర్స్‌లో విజేతగా గుమ్మిలేరు, జూనియర్స్‌లో సామర్లకోట ఎడ్లు



పోటీలో పరిగెడుతున్న ఎడ్లు

సామర్లకోట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): కుమార రామ భీమేశ్వరా రాష్ట్ర స్థాయి ఎడ్ల పరుగు ప్రదర్శన పోటీలు ఆదివారం కాకినాడ జిల్లా సామర్లకోట ఉండూరు ఎస్ఎఫ్‌సీఎల్ ఫైప్‌లైన్ రోడ్డులో ఉత్సాహంగా నిర్వహించారు. వల్లూరి సత్యేంద్రకుమార్ మెమోరియల్‌గా ఈ పోటీలను నిర్వహించగా మున్సిపల్ మాజీ చైర్మన్ డాక్టర్ చందలాడ అనంత పద్మనాభం, ఎమ్మెల్యే చినరాజప్ప తనయుడు నిమ్మకాయల రంగనాగ్ ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా హాజరైన పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పోటీలను తిలకించి విజేతలకు బహుమతులు అందజేశారు. 4 కిలోమీటర్లు వెళ్లి వచ్చేందుకు నిర్వహించిన పోటీల్లో సీనియర్స్ విభాగంలో ప్రథమ స్థానాన్ని గుమ్మిలేరుకు చెందిన కోరా శృతిచౌదరికి చెందిన ఎడ్లు ప్రథమ స్థానంలో నిలిచింది. ద్వితీయ స్థానంలో అనకాపల్లి అర్జనగిరికి చెందిన పరవన్నాయుడి ఎడ్లు, తృతీయ స్థానంలో గుమ్మిలేరుకు చెందిన ఎడ్లు నిలిచి బహుమతులు సాధించాయి. సీనియర్స్ విభాగంలో 12 జతల ఎడ్లు పాల్గొన్నాయి.

జూనియర్స్ విభాగంలో సామర్లకోట వల్లూరి సత్యేంద్రకుమార్‌కు చెందిన ఎడ్లు ప్రథమ స్థానం, ద్వితీయ స్థానంలో వడిశలేరు సిద్దివినాయక శ్రీనివాసుకు చెందిన ఎడ్లు, తృతీయ స్థానంలో గాడాల మద్దాల శ్రీనుకు చెందిన ఎడ్లు, నాల్గోస్థానంలో వెల్దుర్తి మొగలి ఏసుబాబుకు చెందిన ఎడ్లు, ఐదోస్థానంలో సామర్లకోట వల్లూరి సత్యేంద్రకుమార్‌కు చెందిన ఎడ్లు నిలిచి బహుమతులు సాధించాయి. జూనియర్స్ విభాగంలో మొత్తం 25 జతల ఎడ్లు పాల్గొన్నాయి. పోటీల నిర్వాహకులు కంటే జగదీష్‌మోహన్, వల్లూరి దొరబాబు తదితర కమిటీ ప్రతినిధుల చేతుల మీదుగా ఎమ్మెల్యేను సత్కరించారు.



సీనియర్స్ విభాగంలో ప్రథమ బహుమతిని శృతిచౌదరికి అందజేస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప

బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం అమలు చేయాలి

జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంగళరావుయాదవ్



మాట్లాడుతున్న వెంగళరావుయాదవ్

అమలాపురం టౌన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): దేశానికి స్వాతంత్య్రం వచ్చి దశాబ్దాలు గడిచిన వెనుకబడిన వర్గాలు అంతకంతకు వెనుకబడిపోతున్నాయని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంకగళరావు యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం జరిగిన సంక్షేమ సంఘ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. జనాభా దామాషా ప్రకారం బీసీలకు చట్టసభల్లో సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇందు కోసం జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అన్ని రాష్ట్రాల బీసీ ప్రతినిధులతో ఢిల్లీని దిగ్బంధనం చేస్తామని ప్రధాని మోదీకి బీసీల సత్తా చూపిస్తామన్నారు. సమాజంలో బీసీలపై దాడులు, అవమానాలు పెరిగిపోతున్నందున రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వెంటనే బీసీలకు ప్రత్యేక రక్షణచట్టం అమలు చేయాలన్నారు. చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరారు.

కార్యవర్గ సభ్యులుగా నియామకం

జిల్లా నుంచి జాతీయ బీసీసంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మట్ట రాంబాబు, రాష్ట్ర కార్యదర్శులుగా కైల శోభన్‌బాబు, కందుల విజయ్‌కుమర్‌లను నియమిస్తూ నియామక పత్రాలు అందజేశారు. జిల్లాశాఖ గౌరవాధ్యక్షుడిగా రాయుడు సత్యరుషి, అధ్యక్షునిగా కాటాడి ఉమామహేశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కోరశిఖ సుబ్రహ్మణ్యం, జిల్లా ఉపాధ్యక్షులుగా పావులూరి శివరామకృష్ణ, సూరిబోయిన సుబ్రహ్మణ్యం, కోశాధికారి, అధికార ప్రతినిధిగా కానుబోయిన దుర్గాప్రసాద్, యువజన సంఘ అధ్యక్షునిగా మందపాటి బాలు, కార్యదర్శులుగా కముజు శ్రీనివాసరావు, టేకి వెంకటరమణలను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గ సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించి వెంగళరావుయాదవ్ అభినందించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బూరుబోయిన శ్రీనివాసరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు కృష్ణమోహన్‌ముదిరాజ్, గొనుగుంట్ల యల్లమందరావు, కార్యదర్శి చిట్టిబాబు పాల్గొన్నారు.

పరారైన ఖైదీని పట్టుకున్న పోలీసులు



ఖైదీతో యానాం పోలీసులు

యానాం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): యానాం సబ్ జైలు నుంచి రిమాండ్ ఖైదీ పరారైన కొద్దిగంటల్లోనే యానాం పోలీసులు పట్టుకున్నారు. దాదాపు 25అడుగు ఎత్తున్న సబ్ జైల్ ప్రహరీ దూకి నిందితుడు కే.వెంకటేశ్వరరావు పరారైన విషయం తెలిసిందే. శనివారం రాత్రి పోలీసులు కాకినాడ రైల్వే స్టేషన్‌లో ఖైదీని పట్టుకున్నారు. క్రైం సిబ్బంది పబ్బినీడి ఏసుబాబు, మల్లాడి గణేష్, దేవరపల్లి సురేష్‌లను సీఐ షణ్ముగం, మాజీ సీఐ గూటం శివగణేష్ అభినందించి సత్కరించారు.

విద్యారంగంలోని ఆర్థిక సమస్యలను పరిష్కరించాలి

యూటీఎఫ్ పోరుబాట విద్యాసదస్సులో రాష్ట్ర నాయకులు, పీడీఎఫ్ ఎమ్మెల్సీల డిమాండ్



పోరుబాట సదస్సులో మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, హాజరైన ఉపాధ్యాయులు

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): విద్యారంగంలోని ఆర్థిక సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని, ఉద్యోగులు, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలపై రోడ్ మ్యాప్ ప్రకటించాలని యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు, పీడీఎఫ్ ఎమ్మెల్సీలు డిమాండ్ చేశారు. ఆదివారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని శ్రీ వెంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో పోరుబాట పేరుతో ప్రాంతీయ విద్యాసదస్సు జరిగింది. సదస్సులో యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.వెంకటేశ్వర్లు, కేఎస్ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ గత ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు రూ.20 వేల కోట్లు బకాయిలు పెట్టి వెళ్లిపోయిందన్నారు. కొత్త ప్రభుత్వంపై గంపెడాశలు పెట్టుకుంటే అధికారంలోకి వచ్చి 9 నెలలు గడిచినా బకాయిల చెల్లింపుపై శ్రద్ధ చూపడంలేదన్నారు. తక్షణం బకాయిలు చెల్లించాలని, 29శాతం ఐఆర్ ప్రకటించి, 12వ పీఆర్‌సీ కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మాస్టార్లు మార్కిస్టు, కమ్యూనిస్టు భావాలతో ఉన్నపుడే నూతన మానవులను, నూతన సమాజాన్ని తయారు చేయగలరన్నారు. టీచర్ ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వం జీవో 117 రద్దు, పాఠశాలల కుదింపు, పాఠశాలల్లో రెండు మీడియంలు కొనసాగింపు వంటి సమస్యలు పరిష్కరించకపోతే పోరాటాలు అనివార్యమన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.అరుణకుమారి అధ్యక్షత వహించారు. సదస్సులో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు జ్యోతిబసు, తోటకూర చక్రవర్తి, కె.శ్రీదేవి, తూర్పుగోదావరి, డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ, పశ్చిమగోదావరి, అల్లూరి మన్యం జిల్లాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.జయకర్, ఏ.షరీఫ్, కేవీవీ నాగేశ్వరరావు, విజయరామరాజు, రామభద్రం, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మార్చి 31 వరకు గోదావరి డెల్టాకు నీటి విడుదల

డొంకరాయి జలాశయం ద్వారా 4 వేల నుంచి 5వేల క్యూసెక్కులు విడుదల

మోతుగూడెం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): సీలేరు కాంప్లెక్సులోని డొంకరాయి జలాశయం నుంచి గోదావరి డెల్టాకు నీటి విడుదలను మార్చి 31 వరకు కొనసాగిస్తామని జెన్‌కో వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం విడుదల చేస్తున్న 4వేల నుంచి 5వేల క్యూసెక్కులకు పెంచామని పేర్కొన్నాయి. ధవళేశ్వరం వద్ద నీటి మట్టాలు తగ్గుముఖం పట్టడంతో ఇరిగేషన్ అధికారుల అభ్యర్థన మేరకు అదనపు నీటిని విడుదల చేస్తున్నామన్నారు. అలాగే పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తి అనంతరం విడుదలయ్యే మరో 4300క్యూసెక్కులు గోదావరి డెల్టాకు విడుదల చేస్తున్నామని ఆ వర్గాలు పేర్కొన్నారు. డొంకరాయి జలాశయం నుంచి మార్చి 21వ తేదీ వరకు నీటి విడుదల చేయాలని ఇరిగేషన్ అధికారులు తొలుత కోరారు. అయితే రబీ పంటలకు నీటి వినియోగం పెరగడంతో ఇరిగేషన్ అధికారులు మార్చి 31 వరకు కొనసాగించాలని కోరారు. ఈ మేరకు శనివారం ఉదయం నుంచి డొంకరాయి నుంచి 5వేల క్యూసెక్కులు, పొల్లూరు జల విద్యుత్ కేంద్రం నుంచి 4300 క్యూసెక్కులు కలిసి 9,300 క్యూసెక్కులు గోదావరి డెల్టాకు విడుదల చేస్తున్నట్టు జెన్‌కో వర్గాలు తెలిపాయి. ఫిబ్రవరి 10 నుంచి మార్చి 21 వరకు డొంకరాయి స్పిల్‌వే గేట్లు నుంచి విద్యుదుత్పత్తి చేయకుండా గోదావరి డెల్టాకు 10.19 టీఎంసీలు నీటిని విడుదల చేశామని ఆ వర్గాలు తెలిపాయి. బలిమెల జలాశయంలో ఆంధ్రావాటాగా 36.7088 టీఎంసీలు, గుంటవాడ, డొంకరాయి జలాశయాల్లో 13.5906టీఎంసీలు కలిసి 50.2994 టీఎంసీలనీటి నిల్వలు ఉన్నాయని పేర్కొన్నాయి. ఈ ఏడాది వేసవిలో సీలేరు కాంప్లెక్సులోని జల విద్యుత్ కేంద్రాలకు నీటి కొరత లేదని జెన్‌కో అధికారులు తెలిపారు.

నాలుగు రోజుల్లో కొత్తపేటకు వస్తా

పరారైన సత్యసూర్య బ్యాంకర్స్ నిర్వాహకుడు సెల్ఫీ వీడియో




సెల్ఫీ వీడియోలో మాట్లాడుతున్న హేమంత్

కొత్తపేట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట సత్యసూర్య బ్యాంకర్స్ నిర్వాహకుడు పరారై సుమారు 45 రోజులు గడుస్తున్న విషయం తెలిసిందే. అయితే ఆదివారం హేమంత్ ఒక సెల్ఫీ వీడియోను విడుదల చేసి పలు విషయాలను చెప్పాడు. తాను ప్రాణభయంతో పారిపోయానని, 4రోజుల్లో కొత్తపేటకు వస్తానని తెలపాడు. అయితే తమ వ్యాపార సంస్థలో తాకట్టు పెట్టిన ఏ బంగారు వస్తువులను కరిగించలేదని కూడా తీసుకుని వెళ్లలేదని చెప్పాడు. తాను నమ్మి ఒక రియల్ ఎస్టేట్ వ్యాపారితో కొన్ని లావాదేవీలు జరపడం అతడు సమాధానం చెప్పకపోవడంతో తాను పరారీ కావాల్సి వచ్చిందన్నాడు. తమ తాకట్టు వ్యాపారంలో కుదువపెట్టిన ఖాతాదారులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రతి పద్దు వివరాలు తన వద్ద ఉన్నాయన్నాడు. ఖాతాదారులు పెట్టిన బంగారు వస్తువుల సైతం కొన్ని తన వద్ద, మిగిలినవి తన పార్టనర్స్ వద్ద భద్రంగా ఉన్నాయని తాను వచ్చిన తరువాత పోలీసుల సమక్షంలో అన్ని వెల్లడిస్తానని హేమంత్ వీడియోలో పేర్కొన్నాడు.

జేఎన్టీయూకేను రోల్ మోడల్‌గా నిలిపేందుకు కృషి

వీసీ ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్



ప్రభాకరరావుకు జ్ఞాపిక అందజేస్తున్న వీసీ

జేఎన్టీయూకే, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): వికసిత్ భారత్-2047, వికసిత్ ఆంధ్రప్రదేశ్-2047 మాదిరిగా వికసిత్ జేఎన్టీయూకే-2047కు అనుగుణంగా రోడ్ మ్యాప్ తయారుచేసి జేఎన్టీయూకేను దేశంలోని విద్యాసంస్థలకు రోల్ మోడల్‌గా నిలిపేందుకు కృషి చేయనున్నట్టు ఉపకులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే. ప్రసాద్ పేర్కొన్నారు. వర్శిటీలోని యూసీఈకే సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో సౌధా-2కె25 పేరుతో 2 రోజుల పాటు ఓఎస్డీ డి.కోటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన జాతీయస్థాయి సింపోజియం టెక్‌ఫెస్ట్ ఆదివారం సాయంత్రం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వీసీ ప్రొఫెసర్ సీఎస్ఆర్కే.ప్రసాద్, విశిష్ట అతిథిగా పూర్వ విద్యార్థి, విశ్రాంత కల్నల్ ఎంఎస్.ప్రభాకరరావు హాజరయ్యారు. వీసీ మాట్లాడుతూ వినూత్న కార్యక్రమాలు, నూతన ఆలోచనలకు ఇటువంటివి మంచి వేదికగా నిలుస్తాయన్నారు. ప్రభాకరరావు మాట్లాడుతూ వర్శిటీ నుంచి ఎంతోమంది పూర్వ విద్యార్థులు త్రివిధ దళాల్లో చేరి దేశానికి సేవచేశారని, వారిని స్ఫూర్తిగా తీసుకుని ప్రస్తుత ఇంజనీరింగ్ విద్యార్థులు కూడా దేశానికి సేవచేసేందుకు త్రివిధ దళాల్లో చేరాలని సూచించారు. సింపోజియంలో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన పేపర్, పోస్టర్ ప్రజంటేషన్, డ్రోన్ ప్రజంటేషన్, స్పాట్ ఈవెంట్స్, టెక్నికల్ క్విజ్ తదితర పోటీల్లో విజేతలకు, పాల్గొన్న విద్యార్థులకు అతిథులు బహుమతులు, ప్రతిభాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సీఈఈ శ్రీనివాసులు, డైరెక్టర్లు, విభాగాధిపతులు, జేవీఆర్ మూర్తి, రామ్‌ప్రసాద్, రాజ్‌కుమార్,అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జనసేన సభను విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

పిఠాపురం, మార్చి 23(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం చిత్రాడ శివారులో నిర్వహించిన జనసేన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవ బహిరంగ సభ జయకేతనం విజయవంతం చేసినందుకు ప్రతి ఒక్కరికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్టు జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదివారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. సభ దిగ్విజయం చేసేందుకు కృషి చేసిన అందరికి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలిపారు. సభా ప్రాంగణాన్ని వేడుకకు అనువుగా తీర్చిదిద్దేందుకు కృషి చేసిన నియోజకవర్గ నాయకులు ఓదూరి నాగేశ్వరరావు, కిషోర్, కరణం సూరిబాబులకు, జయకేతనం విజయవంతం చేసేందుకు సభా ప్రాంగణం వద్ద కృషి చేసిన నాయకులు బొజ్జా రాంప్రసాద్, తలారి శ్రీనివాస్, మొగ లి రాజా, పోలం రాజేష్, కంచర్ల భవానీశంకర్, ఫులపా రాజేష్, మేళం రామకృష్ణ, పిండి శ్రీను, గరగ అయ్యప్ప, చక్కపల్లి వినయ్, పబ్బినీడి ప్రసాద్‌కు, సభా వద్ద పనిచేసిన వలంటీర్లు, వీరమహిళలు, జనసైనికులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

నిర్మలగిరిలో ప్రత్యేక ప్రార్థనలు

మేరీమాత మహోత్సవాలకు తరలిన భక్తులు

దేవరపల్లి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా గౌరీపట్నం నిర్మలగిరి పుణ్యక్షేత్ర మేరీమాత మహోత్సవాల్లో ఆదివారం మేరీ మాత మందిరం వద్ద భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆదివారం పవిత్ర దినం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచి ఆలయంలో దివ్య బలిపూజ, పరిశుద్ధ జపమాల, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రత్యేక నాటికలు, నిర్వహించారు. ఆలయంలో భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసినట్టు పుణ్యక్షేత్ర డైరెక్టర్ జాన్‌పీటర్ తెలిపారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండడ ంతో ఇటు దేవరపల్లి నుంచి అటు పంగిడి నుంచి వాహనాలను పోలీసులు మళ్లించారు.



నిర్మలగిరి మెట్ల మార్గంలో కొండపైకి వెళ్తున్న భక్తులు



మేరీమాత మందిరం వద్ద ప్రార్థనలు చేస్తున్న భక్తులు

సత్యదేవుని భూములను పరిశీలించిన అటవీశాఖ కన్జర్వేటర్



గొందిలో దేవస్థానం భూములను పరిశీలిస్తున్న అధికారులు

అన్నవరం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానం ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల్లో ఉన్న భూములను ఆదివారం అటవీశాఖ కన్జర్వేటర్ శివరామ్, దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావు, దేవస్థానం భూముల విభాగ అధికారులతో కలిసి పరిశీలించారు. ముఖ్యంగా చెందుర్తి, గొంది గ్రామాల్లో ఉన్న భూముల్లో ఏ విధమైన పంట పండించాలి, దీని అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై త్వరలో నివేదికను ఇస్తామని దానిని అనుసరించాలని తెలిపారు. దేవస్థానం ఆధ్వర్యంలో అన్నవరం ఉద్యానవనాల్లో పెంచుతున్న మారేడు వనాలపై మాట్లాడుతూ చెట్టు ఆకులను మాత్రమే కోయాలని తెంపడం, నరకడం చేయకూడదని అలా చేయడం వల్ల వనం పెరగదన్నారు. ఎప్పటికప్పుడు డ్రిప్ ద్వారా నీరు మొక్కలకు చేరేలా చూడాలన్నారు. కళాశాలను ఆనుకుని ఉన్న ఉద్యానవనం, కొండపై వేదపాఠశాల, నక్షత్రవనంలో మొక్కలు పెంచేవిధానం బాగుందని ప్రశంసించారు.

భక్తులతో కిక్కిరిసిన 'లోవ క్షేత్రం'

తుని రూరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని మండలంలోని లోవ క్షేత్రం తలుపులమ్మ నామస్మరణతో మారుమోగింది. ఆదివారం తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. ప్రత్యేక క్యూలలో బారులు తీరిన భక్తులు అమ్మవారిని దర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆరు బయట వంటావార్పు చేసుకుని సహపంక్తి భోజనాలు చేశారు. ఆలయానికి రూ.5.10 లక్షల ఆదాయం సమకూరినట్టు ఈవో విశ్వనాథరాజు ఓ ప్రకటనలో తెలిపారు.

రాజమహేంద్రవరం
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి

భవన నిర్మాణాల్లో నిబంధనలు మీరొద్దు

» కమిషనర్ కేతన్ గార్గ్ » గాదాలమ్మనగర్‌లో అపార్టుమెంట్ల తనిఖీ


గాదాలమ్మనగర్‌లో అపార్టుమెంట్లు పరిశీలిస్తున్న కమిషనర్

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 23(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో నిబంధనల మేరకే భవనాలు నిర్మించాలని నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. ఆదివారం గాదాలమ్మనగర్‌లో జీవీఎంఎస్ నెం 119కు లోబడి నిర్మించిన రెసిడెన్షియల్ అపార్టుమెంట్ ఆక్యుపెన్సీ ఫైల్‌ను కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా అపార్టుమెంట్‌తో పాటు భూగర్భ జలాల పెంపు కోసం నిర్మించిన వర్షపు నీటి గుంతలు పరిశీలించారు. భవన ఎత్తు, సెట్‌బ్యాక్‌లు, అపార్టుమెంట్ యాక్సెస్ కలిగిన రహదారి వెడల్పు పరిశీలించారు. పట్టణ నిర్మాణ నిబంధనలకు అనుగుణంగా నిర్మాణాలు ఉన్నాయా లేదా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ భవన పరిపాలన నిబంధనలను క్రమంగా పాటిస్తూ పట్టణ ప్రణాళికకు అనుగుణంగా భవన నిర్మాణాలను నిర్ధారించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సిటీ ప్లానర్ జి.కోటయ్య, డిప్యూటీ ప్లానర్ సత్యనారాయణ రాజు, పట్టణ ప్రణాళిక అధికారులు పాల్గొన్నారు.

ఎస్సీ మహిళలు ఆర్థిక పురోభివృద్ధి సాధించాలి

ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ.. లబ్ధిదారులకు సబ్సిడీ రుణాల అందజేత


లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బత్తుల

రాజానగరం, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ఎస్సీ మహిళలు సబ్సిడీ రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థిక పురోభివృద్ధి సాధించాలని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆకాంక్షించారు. ప్రధానమంత్రి అనుసూచిత్ జాతి అభ్యుదయ యోజన (పీఎం-అజయ్)పథకంలో భాగంగా నియోజకవర్గంలోని డ్వాక్రా సంఘాల్లోని ఎస్సీ మహిళలకు మంజూరైన సబ్సిడీ రుణాల నగదు చెక్కులను రాజానగరంలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎస్సీ వర్గాలను ఉద్ధరించేందుకు ఈ పథకానికి ప్రభుత్వం రూపకల్పన చేసిందన్నారు. డ్వాక్రా సంఘాల్లోని సభ్యులు సబ్సిడీ రుణాలతో సొంతంగా వ్యాపారాలు చేసుకుంటూ ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. కార్యక్రమంలో రాజానగరం, కోరుకొండ, సీతానగరం సెర్ప్ ఏపీఎంలు, సీసీ గుమ్మడి సునీత, జిలానీ, నాగమణి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి వక్తృత్వ పోటీలకు షకీనా ఎంపిక

రాజానగరం, మార్చి 23(ఆంధ్రజ్యోతి): వీక్షిత్ భారత్ యూత్ పార్లమెంట్-2025 సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్శిటీలో నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో తమ కళాశాల విద్యార్థిని ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఎండీ ధనరాజు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఒకే దేశం ఒకే ఎన్నిక వీక్షిత్ భారత్ అభిప్రాయాన్ని తెలుపుతోందని అనే అంశంపై ఇటీవల తమ కళాశాలలోని ఎన్ఎస్ఎస్ వలంటీర్ కె.షకీనా గియానా తన వ్యక్తిగత మౌఖిక సంభాషణ భాషపై సమర్థవంతంగా జాతి నిర్మాణానికి కావాల్సిన అంశాలను తెలియజేస్తూ 430/500 మార్కులతో ప్రథమ స్థానంలో నిల్చిందన్నారు. అమరావతిలో ఈ నెల 28న జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటుందన్నారు. ఈ సందర్భంగా విజేత కె.షకీనాను ప్రిన్సిపాల్ ధనరాజు, ఎన్ఎస్ఎస్ పీవో షేక్ మీరా, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

శాంతియుత నిరసన అడ్డుకోవడం సరికాదు

» కాంగ్రెస్ పార్టీ జగ్గంపేట ఇన్‌చార్జి శివగణేష్

గోకవరం, మార్చి23(ఆంధ్రజ్యోతి): బాధితులకు అండగా నిలిచేందుకు వెళ్తున్న తమను పోలీసులు అడ్డుకోవడం సమంజసంగా లేదని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మరోతి శివగణేష్ ఆగ్రహం వ్యక్తంచేశారు. మండలంలోని గుమ్మళ్ళదొడ్డి గ్రామ సమీపంలో నిర్మించిన అస్సాగో ఇథనాల్ పరిశ్రమకు వ్యతిరేకంగా ఆదివారం సాయంత్రం బాధితుల తరుపున నిరసన చేపట్టేందుకు వెళ్తుండగా వీరలింకపల్లి వద్ద సీఐ సత్యకిషోర్, ఎస్ఐ పవన్‌కుమార్ అడ్డుకున్నారు. ఈ సందర్భంగా శివగణేష్ మాట్లాడుతూ కాలుష్య కారకమైన పరిశ్రమ నుంచి బాధితులకు న్యాయం జరిగేందుకు కోసం శాంతియుతంగా ఆందోళన చేపట్టేందుకు వెళ్తుంటే పోలీసులు అడ్డుకోవడం దారుణమన్నారు. బాధితులకు కాకుండా పరిశ్రమ నిర్వాహకులకు పోలీసులు అండగా నిలవడంపై ఆయన మండిపడ్డారు. కాగా శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా ఉండేందుకే శివగణేష్ తో పాటు, పార్టీ నాయకులను అడ్డుకున్నట్టు పోలీసులు తెలిపారు. కార్యక్రమంలో వత్సవాయి సత్యనారాయణ రాజు, గుర్రాల రత్నాజీరావు, నక్కా సత్యనారాయణ, కొండా శ్రీను, నేదరు భాస్కరరావు, వెంకటరత్నం, బొల్లం బాపిరాజు పాల్గొన్నారు.

కృష్ణభారతి మృతికి ఎంపీ పురందేశ్వరి సంతాపం


కృష్ణభారతితో ఎంపీ పురందేశ్వరి (ఫైల్)

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబానికి చెందిన గాంధేయవాది పసల కృష్ణభారతి (92) మృతిపట్ల రాజమండ్రి ఎంపీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి సంతాపం తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేస్తూ కృష్ణభారతి హైదరాబాద్ స్నేహపురి కాలనీలోని స్వగృహంలో మరణించారన్న సమాచారం తెలిసిందని పేర్కొన్నారు. పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన స్వాతంత్ర్య సమరయోధులు పసల కృష్ణమూర్తి-అంజలక్ష్మీ దంపతుల రెండో కుమార్తెయైన కృష్ణభారతి తుది వరకూ గాంధీజీ ప్రవచించిన విలువలతో జీవించారని తెలిపారు. పలు విద్యాసంస్థలకు ఆర్థికంగా చేయూత అందించారని, ముఖ్యంగా దళితుల్లో విద్యావ్యాప్తికి కృషి చేశారన్నారు. 2022 జులైలో భీమవరంలో జరిగిన అల్లూరి సీతారామరాజు విగ్రహావిష్కరణ సందర్భంగా ప్రధాని మోదీ కృష్ణభారతిని సత్కరించి ఆమెకు పాదాభివందనం చేసి ఆశీస్సులు తీసుకున్నారని ఈ సందర్భంగా పురందేశ్వరి గుర్తు చేసుకున్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

నటరాజ రామకృష్ణ 102వ జయంతి


కళాకారిణుల నృత్య ప్రదర్శన

రాజమహేంద్రవరం కల్చరల్ మార్చి23(ఆంధ్రజ్యోతి): నాట్యకళా పితామహుడు, పద్మశ్రీ నటరాజ రామకృష్ణ 102వ జయంతి నాట్యోత్సవంలో భాగంగా ప్రకాశ్‌నగర్ ధర్మంచర కమ్యూనిటీ హాలులో ఆదివారం సప్పా యశోద కృష్ణ 20 మంది శిష్యబృందంతో చేసిన శాస్త్రీయ నృత్య ప్రదర్శన ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. కళాకారిణిలకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందించి సత్కరించారు. కార్యక్రమంలో జక్కంపూడి విజయలక్ష్మి, దాట్ల వెంకటపతిరాజు, భాస్కరరామ్,మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, సీసీసీ ఎండీ పంతం కొండలరావు, పవనగిరి స్వామి,మంతెన కేశవ రాజు, పీపీఎస్ కృష్ణారావు, ఆకుల వీర్రాజు, చావలి రాజేశ్వరరావు పాల్గొన్నారు.

12న పూలే, అంబేడ్కర్ పురస్కారాల ప్రదానం

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 23(ఆంధ్రజ్యోతి): దేశానికి దిశా నిర్దేశం చేసిన మహనీయులు మహాత్మా జ్యోతిరావు పూలే, బీఆర్ అంబేడ్కర్‌ల పేరిట ఇద్దరు నేతలకు పురస్కారాలను వచ్చేనెల 12న రాజమహేంద్రవరంలో ప్రదానం చేయనున్నట్టు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు సానబోయిన రామారావు, వైస్ చైర్మన్ ఎల్వీ ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు బద్దే జార్జి ఆంటోని తెలిపారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. 12న స్థానిక చెరుకూరి కళ్యాణ మండపంలో జరిగే సభలో పూలే పురస్కారాన్ని మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావుకు, అంబేడ్కర్ పురస్కారాన్ని రాష్ట్ర దళిత సేన అధ్యక్షుడు జేబీ రాజుకు అందించి సత్కరిస్తామన్నారు. సమావేశంలో దారపు నాగేశ్వరరావు, సభ్యులు మట్టపర్తి సత్యనారాయణ, బీఎస్పీ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

కోటసత్తెమ్మకు పూజలు

ఉండ్రాజవరం/నిడదవోలు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): నిడదవోలు మండలంలోని తిమ్మరాజుపాలెంలో వేంచేసియున్న కోటసత్తెమ్మ అమ్మవారి ఆలయ వద్ద ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం కమిటీ సభ్యులతో ఆదాయం లెక్కించగా రూ.1,43,757 వచ్చినట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి వి.హరిసూర్యప్రకాష్ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ దేవులపల్లి రవిశంకర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రదాత భగత్‌సింగ్

» అసమానతలు లేని సమాజం కోసం పోరాడాలి
» ఏపీఆర్‌సీఎస్ జిల్లా అధ్యక్షుడు రాజబాబు
» స్వాతంత్ర్య సమరయోధులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌లకు నివాళి


సింగంపల్లిలో భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రాజబాబు

రంగంపేట, మార్చి 23(ఆంధ్రజ్యోతి): అసమానతలు లేని సమాజం కోసం భగత్‌సింగ్ స్ఫూర్తితో పోరాడాలని ఏపీఆర్‌సీఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు అన్నారు. బ్రిటిష్ సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా, భారతీయుల విముక్తి కోసం ప్రాణాలర్పించిన యువ కిశోరాలు షాహిద్ భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల వర్ధంతిని పలుచోట్ల ఆదివారం నిర్వహించారు. రంగంపేట మండలం సింగంపల్లిలోని సీపీ రెడ్డినగర్ కాలనీలో ఏపీ రైతు కూలీ సంఘం, అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య, ప్రగతిల మహిళా సంఘం (స్త్రీవిముక్తి) ప్రజా సంఘాల ఆధ్వర్యంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఏపీఆర్‌సీఎస్ నాయకుడు చెక్క సత్తిబాబు అధ్యక్షతన నిర్వహించిన సభలో రాజబాబు మాట్లాడారు. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌లు నూనుగు మీసాల వయస్సు దేశం కోసం ఉరికొయ్యను ముద్దాడి తమ ప్రాణాలను స్వతంత్ర ఉద్యమాన్ని రగిలించేందుకు బలిదానం చేశారని, వారి త్యాగం ఎనలేనిదని కొనియాడారు. నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మతోన్మాద రాజకీయాలు చేస్తూ ప్రజల్ని అసలు సమస్యల నుంచి పక్కదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. పీడిత, తాడిత ప్రజలు కులమతాలకు అతీతంగా భగత్‌సింగ్ పోరాట స్ఫూర్తితో మరో స్వాతంత్ర్య పోరాటానికి సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎఫ్‌టీయూ నాయకులు బంగారు ప్రసాద్, ఏపీఆర్‌సీఎస్ నాయకుడు డి.సురేష్, ప్రగతిశీల మహిళా సంఘం నాయకులు నర్లా లక్ష్మీదేవి, చెక్క రమాదేవి పాల్గొన్నారు.

కడియం: కడియంలో భగత్‌సింగ్ సేవాసమితి అధ్యక్షుడు తమ్మిశెట్టి ప్రసాద్ ఆధ్వర్యంలో స్థానిక బొబ్బిలి బ్రిడ్జి సెంటర్‌లో ఉన్న భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు. భగత్‌సింగ్, సుఖదేవ్, రాజ్‌గురుల త్యాగాలను నేటి యువత తెలుసుకుని బాధ్యతగా దేశభక్తితో మెలగాలని పలువురు అన్నారు. కార్యక్రమంలో న్యాయవాది తోరాటి వసంతరావు, చిలుకూరి శ్రీనివాసరావు, అడపా సుబ్రహ్మణ్యం, కొత్తూరి బాలనాగేశ్వరరావు, తోరాటి శ్రీను, కల్యాణం సూరిబాబు, కొత్తూరి కృష్ణ పాల్గొన్నారు.

గోకవరం: గోకవరంలో జరిగిన భగత్‌సింగ్ వర్ధంతి కార్యక్రమంలో పీడీఎస్‌యూ(వి) ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ మాట్లాడుతూ భగత్‌సింగ్ ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరూ పాటుపడాలని, ప్రశ్నించేతత్వం, ధైర్యసాహసాలను అలవర్చుకోవాలన్నారు. పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం కల్చరల్: పీస్ ఫర్ పీ పుల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో గాంధీపురంలోని కార్యాలయంలో భగత్‌సింగ్, రాజ్ గురు, సుఖదేవ్‌ల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్గనైజేషన్ అధ్యక్షుడు లంక సత్యనారాయణ మాట్లాడుతూ స్వాతంత్ర్యయోధులను ఆదర్శంగా తీసుకుని సన్మార్గంలో నడవాలని కోరారు. కార్యక్రమంలో వై.సూరిబాబు, టి.దుర్గాప్రసాద్, కేవీ రమేష్‌బాబు, వైకేఎల్ఎన్ రెడ్డి, ఎం.సుధాకర్ పాల్గొన్నారు. స్థానిక రాజేంద్రనగర్‌లో సీపీఐ నాయకుడు నల్లా రామారావు, భ్రమరాంబ దంపతుల ఆధ్వర్యంలో భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో అల్లంకి మణికంఠ, బళ్లా శ్రీనివాస్, కొడమటి బవర్రాజు, రెడ్డి బోసు, కర్రా మురళీకృష్ణ, పి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం అర్బన్: స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతి నిర్వహించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతలపూడి సునీల్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం భగత్‌సింగ్ ఎంప్లాయిమెంట్ గ్యారంటీ యాక్టు అమలు చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగం పెరిగిపోతుండడంతో యువత ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిపోతున్నారని, దీన్ని అరికట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాస్, పి.త్రిమూర్తులు, పి.లావణ్య, సింహరాజు, సాయి తదితతరులు పాల్గొన్నారు.


కడియంలో భగత్‌సింగ్ వర్ధంతి కార్యక్రమం

శ్యామలానగర్‌లో మహాన్నదానం

రాజమహేంద్రవరం కల్చరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): శ్యామలానగర్‌లోని పాత సోమాలమ్మ ఆలయం వద్ద ధర్మకర్త గొర్రెల సురేష్ ఆధ్వర్యంలో మహాన్నదానం నిర్వహించారు. పాత సోమాలమ్మ జాతర ఉత్సవాలు ఈ నెల 13న ముగిసాయి. ఈ సందర్భంగా అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విరాళాలు అందించిన దాతలకు సురేష్ కృతజ్ఞతలు తెలిపారు.

దొమ్మేటి ఆశయాలు సాధిస్తాం

వెంకటరెడ్డి జయంతి సభలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి


దొమ్మేటి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి, పితాని

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 23(ఆంధ్రజ్యోతి): శెట్టిబలిజ పితామహుడు దొమ్మేటి వెంకటరెడ్డి ఆశయాలు సాధిస్తామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. శెట్టిబలిజ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు ఆధ్వర్యంలో ఆదివారం లాలాచెరువు సెంటర్‌లోని దొమ్మేటి విగ్రహం వద్ద జరిగిన జయంతి కార్యక్రమానికి వాసుతో పాటు ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, ఆర్టీసీ చైర్మన్ కొనగళ్ల నారాయణ ముఖ్యఅతిథులుగా విచ్చేసి వెంకటరెడ్డి విగ్రహానికి పూలమాలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా వాసు మాట్లాడుతూ గౌడ శెట్టిబలిజ, ఈడిగ, శ్రీయన, యాత కులాలు ఐక్యతకు దొమ్మేటి కృషి చేశారన్నారు. గీత కులస్తులకు మద్యం షాపుల్లో 10శాతం కేటాయించేలా, వారు డిపాజిట్ 50శాతం చెల్లించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. పితాని మాట్లాడుతూ రాజమండ్రిలో మద్యం షాపుల కేటాయింపులో కొంత అన్యాయం జరిగిందని వచ్చే ఏడాది దీన్ని సరిచేయాలని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తామన్నారు. కొనగళ్ల, గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి మాట్లాడుతూ శెట్టిబలిజ అభ్యున్నతికి దొమ్మేటి చేసిన సేవలను గుర్తుచేశారు. అనంతరం టీడీపీ కష్టకాలంలో ఉన్నప్పుడు అండగా నిలిచిన పలువురు శెట్టిబలిజ, గౌడ ప్రజాప్రతినిధులకు ఆత్మీయ సత్కారం నిర్వహించారు. పేదలకు వస్త్రదానం చేశారు. కార్యక్రమంలో వేమగిరి శ్రీను, బుడ్డిగ రాదా, బుడ్డిగ రవి తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాస్ పరీక్షలకు 710 మంది డ్వాక్రా మహిళలు



బిక్కవోలు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని 710 మంది డ్వాక్రా మహిళలకు చదవడం, రాయడం, అంకెలు గుర్తించడం వంటి ఉల్లాస్ కార్యక్రమానికి సంబంధించి ఆదివారం పరీక్షలు నిర్వహించారు. మండలంలో 35 కేంద్రాలు ఏర్పాటు చేసి ఈ పరీక్షలు నిర్వహించామని, నూటికి నూరు శాతం మహిళలు హాజరై పరీక్షలు రాసారని ఎంపీడీవో వి.శ్రీనివాస్ తెలిపారు. పరీక్షా కేంద్రాలను డ్వాక్రా ఏపీఎం సుప్రియ, ఎంఈవో-2 పూర్ణచంద్రరావు పర్యవేక్షించారు.

లౌకికతత్వాన్ని నీరుగారుస్తున్న ప్రధాని మోదీ

» ఏప్రిల్ 14 వరకూ సీపీఐ రాజకీయ ప్రచార జాత : జిల్లా కార్యదర్శి మధు

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ లౌకికతత్వాన్ని నీరుగారుస్తోందని, సీపీఐ రాజకీయ ప్రచార జాత ద్వారా మోదీ ప్రభుత్వాన్ని ప్రజా క్షేత్రంలో ఎండగడతామని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు అన్నారు. ఆదివారం స్థానిక ఊర్వశి సెంటర్లోని కూరగాయల సెక్షన్ వద్దనున్న భగత్‌సింగ్ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సీపీఐ రాజకీయ ప్రచారజాతను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ సోషలిజం, సెక్యులరిజం, సామాజిక న్యాయం, సమానత్వం ఆశాయాలను ప్రజలకు తెలియజేయడం కోసం సర్దార్ భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా ప్రచారజాతను ప్రారంభిస్తున్నామని, ఏప్రిల్ 14వ తేదీ వరకూ ఈ జాత జరుగుతుందన్నారు. దేశపురోగతి కోసం పోరాటం సాగించేందుకు సమున్నత లక్ష్యాలతో కూడిన రాజ్యాంగాన్ని బీఆర్ అంబేడ్కర్ దేశానికి సమర్పిస్తే, దాన్ని మార్చడానికి ఆర్ఎస్ఎస్ కుట్రలు చేస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో జట్టు లేబర్ యూనియన్ అధ్యక్షుడు కూండ్రపు రాంబాబు, సీపీఐ నగర కార్యదర్శి కొండలరావు, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతలపూడి సునీల్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాస్, త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

'ఆలయాల అభివృద్ధికి రూ.1.20 కోట్ల విరాళం'

కంబాల శ్రీనివాసరావు

కోరుకొండ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు దేవాలయాల అభివృద్ధికి ఇప్పటి వరకు రూ.1.20 కోట్లు విరాళాలుగా అందజేసినట్టు విశ్వ హిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆదివారం గాడాల గ్రామంలో దేవిమాత ఆలయానికి రూ.1 లక్ష విరాళంగా అందజేశారు. అలాగే కోరుకొండ కోదండ రామాలయానికి రూ.1.20 లక్షలు అందించారు. కార్యక్రమంలో ఆలయాల కమిటీల సభ్యులు, బీజేపీ మండలాధ్యక్షుడు ఇనకోటి బాపన్నదొర, బత్తుల నానాజీ, ప్రగడ ప్రభ, పసల గణేష్, రుద్రం వెంకటేష్, లంకా సతీష్, అడ్డాల వీరపండు తదితరులు పాల్గొన్నారు.

ధర్మన్నది తెలుగు సాహితీలోకంలో ఓ వీరగాధ

జయంతి సభలో అరసం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు స్వామిప్రసాద్


ధర్మన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

కడియం, మార్చి 23(ఆంధ్రజ్యోతి): కుసుమ ధర్మన్నది తెలుగు సాహితీ లోకంలో ఒక వీరగాధ అని అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గండి స్వామిప్రసాద్ అన్నారు. ధిక్కార స్వర కవి కుసుమ ధర్మన్న 125వ జయంతి కార్యక్రమం ఆదివారం జేగురుపాడులోని సేవాస్థంబ్ కార్యాలయంలో జరిగింది. గోదావరి తీరంలో కందుకూరి వీరేశలింగం శిష్యుడిగా మొదలైన ధర్మన్న సంస్కరణ, స్వాతంత్ర్యం, సామాజిక న్యాయం, సౌమ్యవాద భావనల అపురూప సమ్మేళనం అనడంలో సందేహం లేదని ప్రసాద్ అన్నారు. స్వాతంత్ర్యానికి పూర్వమే సహకార బ్యాంకు స్థాపించి అట్టడుగు వర్గాల అభివృద్ధికి కృషి చేశారని, ఆయుర్వేదంలో ఆయుర్వేదబిషక్ కోర్సులు చేసి వైద్య సేవలందించారన్నారు. సాహితీవేత్తగా, పత్రికా సంపాదకుడిగా, సాంఘిక విప్లవకారునిగా ధర్మన్న కృషి చిరస్థాయిగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ధర్మన్న సాహిత్య సాంస్కృతిక పీఠం వ్యవస్థాపక కార్యదర్శి ఎం.భూషణరావు, సాహితీవేత్తలు ఎం.సత్యనారాయణ, ఎంఎన్ సత్యనారాయణ, కవి టి.నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

కోరుకొండ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం సీఎం సహాయ నిధి చెక్కులను జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు కమిటీ కో ఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందజేశారు. వివిధ గ్రామాలకు చెందిన 19 మంది లబ్ధిదారుల ఇంటింటికీ వెళ్లి రూ.15,53,912 విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు, పాల్గొనున్నారు.

మెగా రక్తదాన శిబిరం


రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బత్తుల

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 23(ఆంధ్ర జ్యోతి): సినీ నటుడు రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా స్థానిక ధన్వంతరి బ్లడ్‌బ్యాంక్‌లో ఆదివారం రాష్ట్ర చిరంజీవి యువత కార్యదర్శి ఏడిద బాబి ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. దీనికి ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. మెగాస్టార్ చిరంజీవి అభిమానులు చేస్తున్న అనేక సేవా కార్యక్రమాలు సమాజానికి ఎంతో స్ఫూర్తిదాయకయమన్నారు. కార్యక్రమంలో జనసేన నగర ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ, జీ3 పిక్చర్స్ ధర్మేంద్ర, వానపల్లి అంజి, దొడ్డి జాని, ఎస్కే బాబా, రాజేష్‌నాయుడు, విజ్జిన శివం, సీకోటి శివాజీ, చిపురి రాజ్‌కుమార్, శ్రీనివాస్ లక్కి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో పంటకు బహిరంగ వేలం

రాజానగరం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో పల్లకడియం గ్రామంలోని ప్రభుత్వ భూమిలో అనుమతి లేకుండా సాగు చేసిన వరి పంటకు ఈ నెల 24న ఉదయం 11గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నామని రాజానగరం తహశీల్దార్ జి.అనంతలక్ష్మి సత్యవతి దేవి ఆదివారం తెలిపారు. గ్రామంలో సర్వే నెంబరు 612, 617లో మధ్యలోని సుమారు రెండు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ప్రభుత్వ భూమిలో అధికారుల అనుమతులు లేకుండా గ్రామానికి చెందిన ఓ వ్యక్తి సాగు చేశారని, ముందు నుంచి అధికారులు హెచ్చరించినా ఖాతరు చేయకుండా వరి సాగు చేశారన్నారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సదరు పంటకు పొలం వద్దనే వేలం నిర్వహించనున్నామని, ఆసక్తి కలిగిన రైతులు వేలం పాటలో పాల్గొనవచ్చని తహశీల్దార్ పేర్కొన్నారు.

స్వర్ణాంధ్ర విజన్-2047 సాకారానికి ప్రవాసాంధ్రులు సహకరించాలి

పీ4 వార్డు సభలో కార్పొరేషన్ సెక్రటరీ శైలజావల్లి

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 23(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర విజన్-2047 సాకారానికి ప్రవాసాంధ్రులు సహకరించాలని రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ సెక్రటరీ శైలజావల్లి కోరారు. కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశాల మేరకు ఆదివారం స్థానిక ప్రకాష్‌నగర్ రౌండు పార్కు, టీ నగర్‌లోని మునిసిపల్ పార్కు, పంతం సత్యనారాయణ మునిసిపల్ స్కూల్ ప్రాంతాల్లో జరిగిన 13 డివిజన్ల వార్డు సభలకు సెక్రటరీ శైలజావల్లి, అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, ఎస్ఈ ఎంసీహెచ్ కోటేశ్వరరావు, సిటీ ప్లానరు జి.కోటయ్య, డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేదల అభ్యున్నతికి 10శాతం ఉన్న సంపన్నులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సభల్లో నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం యువజన జిల్లా ప్రధాన కార్యదర్శిగా గోవిందు

దివాన్‌చెరువు, మార్చి23 (ఆంధ్రజ్యోతి): జాతీయ బీసీ సంక్షేమసంఘం యువజన విభాగం ప్రధాన కార్యదర్శిగా దివాన్‌చెరువు గ్రామానికి చెందిన మందాల గోవిందు నియమితులయ్యారు. ఈ విషయాన్ని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బత్తుల నాగేశ్వరరావు ఆదివారం తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు వై.నాగేశ్వరరావు, మహిళా అధ్యక్షురాలు నూకాలమ్మ, యువజన విభాగం అధ్యక్షుడు ఎల్.మల్లేష్‌ల సమక్షంలో గోవిందుకు నియామకపత్రం అందజేసినట్టు బత్తుల చెప్పారు.

నర్సరీలను సందర్శించిన మాజీ ఎమ్మెల్యే వర్మ

కడియం, మార్చి 23(ఆంధ్రజ్యోతి): పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ కడియపులంక పల్ల వెంకన్న నర్సరీని ఆదివారం సందర్శించారు. పల్ల వెంకన్న కుమారులు సత్తిబాబు, సుబ్రహ్మణ్యం, గణపతి మొక్కను అందజేసి ఆయనను స్వాగతించారు. మొక్కల రకాలు, విశిష్టతలు, పెంపకం వంటి విషయాలను వివరించారు.



రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6 : 20 (సోమవారం సాయంత్రం)
సహర్ : 4:42 (మంగళవారం ఉదయం)



వస్తా.. వెళ్లొస్తా..

రాజమహేంద్రవరంలో రెండు వంతెనల మధ్య భానుడి చిత్రం అద్భుతం.. అదొక అపురూప ఘట్టం.. ఆ దృశ్యం చూడడానికి రెండు కళ్లూ చాలవు.. ఈ చిత్రంలోనే చూడండి.. ఆదివారం సాయంత్రం భానుడు వెళుతూ వెళుతూ పుష్కరఘాట్‌లో ఉన్న జనాలకు ఇలా చాలా సేపు కనువిందు చేసి వెళ్లాడు. ఇలా కెమెరాకు చిక్కాడు. - ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం



వైద్యులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

రుషికొండ బీచ్‌కు బ్లూఫాగ్ పునరుద్ధరణ హర్షణీయం

రాష్ట్ర పర్యాటక మంత్రి కందుల దుర్గేష్

రాజమహేంద్రవరం మార్చి 23 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం రుషికొండ బీచ్‌కు బ్లూఫాగ్‌ను పునరుద్ధరించడంపై రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక, సినిమాటోగ్రఫి శాఖ మంత్రి కందుల దుర్గేష్ సంతోషం వ్యక్తం చేశారు.ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.రుషికొండ బీచ్‌కు బ్లూఫ్లాగ్ గుర్తింపు పునరుద్ధరణపై అసెంబ్లీలో ఇచ్చిన మాట నిలబెట్టుకున్నామన్నారు.సీఎం చంద్రబాబు,డిప్యూటీ సీఎం పవన్‌కు ధన్యవాదాలు తెలిపారు.భారత్‌లో బ్లూఫ్లాగ్ గుర్తింపు పొందిన మొదటి ఎనిమిది బీచ్‌లలో రుషికొండ ఒకటన్నారు.

కేన్సర్‌పై తప్పుడు నివేదికలు ఇవ్వొద్దు

వైద్యులతో ఎమ్మెల్యే నల్లమిల్లి సమీక్ష

అనపర్తి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : బిక్కవోలు మండలం బలభద్రపురంలో కేన్సర్ బాధితులను కనుగొనేందుకు నిర్వహిస్తున్న సర్వే పారదర్శకంగా సాగాలని తప్పుడు నివేదికలు ఇచ్చి సమస్య తీవ్రత తగ్గించేందుకు ప్రయత్నించవద్దని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరం వద్ద ఆదివారం ఎమ్మెల్యే వైద్యాధికారులు, వైద్య సిబ్బందితో సర్వేపై సమీక్షించారు. అసెంబ్లీలో కేన్సర్ తీవ్రతపై తాను ప్రస్తావించడంతో సీఎం చంద్రబాబు నాయుడు, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌లు స్పందించి ప్రత్యేక వైద్య శిబిరంతో పాటు సమగ్ర సర్వేకు ఆదేశాలు జారీ చేశారన్నారు.సర్వే జరుగుతుండగానే స్క్రీనింగ్ టెస్టులు లేకుండా బాధితుల సంఖ్య ఎలా నిర్ధారిస్తారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్వే ప్రారంభమైన రోజునే 23 మంది కేన్సర్ రోగులు ఉన్నారని ఉన్నతాధికారులకు ఏవిధంగా నివేదిస్తారని ప్రశ్నించారు. సర్వే పూర్తయ్యేవరకు స్వయంగా తానే పర్యవేక్షిస్తానని తెలిపారు.గ్రామస్తులు ఇంటింటా సర్వేకు వచ్చిన సిబ్బందికి ఆరోగ్యపరమైన సమస్యలను దాచుకోకుండా చెప్పాలని సూచించారు. ఎమ్మెల్యే వెంట డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు, హెచవోడీ పి.సుజాత, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్ పద్మావతి, ఎంపీడీవో ఎం.రామకృష్ణారెడ్డి, మాజీ ఎంపీటీసీ సుబ్బారెడ్డి తదితరులు ఉన్నారు.

నీటి సరఫరాలో ఇబ్బందులుంటే డయల్ 91001 21190

ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ గిరి

రాజమహేంద్రవరం రూరల్ మార్చి 23(ఆంధ్రజ్యోతి): రానున్న వేసవి దృష్ట్యా జిల్లాలో తాగునీటి సరఫరాకు ఎటువంటి ఆటంకం రాకుండా తగు చర్యలు చేపడుతున్నట్టు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బీవీ.గిరి ఒక ప్రకటనలో తెలిపారు.గ్రామీణ ప్రాంతాల్లో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడితే 91001 21190 నెంబరుకు ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు ఫిర్యాదు చేయ్యవచ్చన్నారు. జిల్లాలో 141 హ్యాండ్ పంపులు,59 సూక్ష్మ నీటి సరఫరా పథకాలు మరమ్మతులు చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా 18 మండలాల పరిధిలోని 482 నివాస ప్రాంతాలకు చెందిన 14.74 లక్షల మందికి ఆర్‌డబ్ల్యూఎస్ ద్వారా తాగునీరు సరఫరా చేయడం జరుగుతుందన్నారు.ఈ మేరకు 2,116 చేతి పంపులు, 308 సూక్ష్మ రక్షిత నీటి సరఫరా పథకాలు,601 ప్రజానీటి సరఫరా పథకాలు 5 సామాజిక ప్రజా నీటి సరఫరా పథకాలు జిల్లాలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. గోదావరి నుంచి నీటిని సరఫరా చేయాలని ప్రతిపాదనలు వచ్చాయన్నారు. కేంద్ర ప్రాయోజిత కార్యక్రమం జల్‌జీవన్ మిషన్ ప్రాజెక్టుల కింద నాలుగు స్థానాలను గుర్తించడం జరిగిందన్నారు. కాకినాడ నుంచి కోనసీమ జిల్లాల్లో కొంత భాగంతో పాటు రాజమహేంద్రవరం రూరల్, కడియం బిక్కవోలు, అనపర్తి మండలాలను కవర్ చేసే విధంగా ధవళేశ్వరం వద్ద రూ.1650 కోట్ల అంచనా, విజ్జేశ్వరం వద్ద పశ్చిమ గోదావరి జిల్లాలోని కొన్ని ప్రాంతాలతో పాటు, ఉండ్రాజవరం, పెరవలి, నిడదవోలు, చాగల్లు, కొవ్వూరు, తాళ్ళపూడి మండలాల్లో రూ. 1400 కోట్ల వ్యయంతో రెండు పనులకు సంబంధించి టెండర్లు పిలిచారన్నారు. వచ్చే నెలలో పనులు ప్రారంభమవుతాయన్నారు. భవిష్యత్‌లో అన్ని మండలాలకు గోదావరి నీరందించేందుకు ప్రణాళిక రూపొందించినట్టు తెలిపారు.

గోదారి.. గొంతు తడారి!



మంచినీళ్లకు వెళుతున్న రాజమండ్రి మహిళలు

గోదావరి చెంతనే ఉన్నా ప్రజల గొంతు తడారిపోతోంది.. గుక్కెడు నీటికి ఎన్నో ఇబ్బం దులు.. ఇదీ ఇటు రాజమహేంద్రవరం.. అటు కొవ్వూరు పరిస్థితి.వేసవి ఆరంభంలోనే ప్రజలు దాహం కేకలు వేస్తున్నారు. దశాబ్ద కాలంగా అన్ని ప్రాంతాలకు గోదావరి జలాలను అందిస్తామని ప్రభుత్వాలు చెబుతూనే ఉన్నాయి. నేటికీ ఆ ప్రతిపాదనలు అమలులోనే ఉన్నాయి. కనీసం గోదావరి చెంతనే ఉన్న ప్రాంతాలకు నదీజలాలు అందడం లేదు. మిగిలిన ప్రాంతాలకు పైపులైను వేసి ఎప్పటికి అందిస్తారో ఆలోచించాల్సిందే మరి.

- సక్రమంగా అందని తాగునీరు
- వేసవి ఆరంభంలోనే ఇక్కట్లు
- గోదారి చెంతనే దాహం కేకలు
- రాజమండ్రిలో శివారున ఇక్కట్లు
- కొవ్వూరుకు అందనే అందవు
- దశాబ్దాలుగా హామీలతోనే సరి
- దేవరపల్లిలో నీటికి ఆందోళన

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం శివారు ప్రాంతాలకు తాగునీటి ఇబ్బందులు తప్పడంలేదు. అటువంటి ప్రాంతాలకు నగరపాలక సంస్థ వాటర్ ట్యాంకర్ల ద్వారా తాగునీరందిస్తున్నారు.నగరంలో ఆనంద్‌నగర్, టీచర్స్ కాలనీ, వెంకటాపురం శివారు ప్రాంతాలు, క్వారీలోని సింహాచల్ నగర్,9వ డివిజన్‌లో వెంకటేశ్వనగర్, బర్మాకాలనీల్లో కొంత సమస్యవుంది. వెంకటేశ్వరనగర్‌లో వాటర్ ట్యాంక్ పనులు పూర్తి చేస్తే నీటి సమస్య అధిగమించవచ్చు. మిగిలిన చోట్లకు నగరపాలక సంస్థ వాటర్ ట్యాంకర్లతో నీరు సరఫరా చేస్తున్నారు.ఈ వేసవిలో నీటి ఎద్దడిని అధిగమించేందుకు నగరపాలక సంస్థ కసరత్తు చేస్తుంది.మిగిలిన ప్రాంతాల ప్రజలకు తాగునీటి ఇబ్బందుల్లేకుండా రోజుకు రెండు పూటలా కార్పొరేషన్ అధికారులు నీటిని సరఫరా చేస్తున్నారు. నగరంలో 50 డివిజన్లలో సుమారు 5 లక్షల మంది జనాభా ఉన్నారు.75 వేల గృహాలు,20 వేల వ్యాపార సంస్థలు ఉన్నాయి. నగరంలో ప్రధాన మంచినీటి విభాగం ద్వారా 50 ఎంఎల్‌డీ వాటర్, టింబర్ యార్డులో ఉన్న 10 ఎంఎల్‌డీ వాటర్ ప్లాంట్ నుంచి, ఆల్‌కట్ గార్డెన్స్ శివారు ధవళేశ్వరం రోడ్డులో ఉన్న మరొక 10ఎంఎల్‌డీ వాటర్ ప్లాంట్‌ల ద్వారా 20 ఎంఎల్‌డీ వాటర్ కలిసి మొత్తం 74.742 ఎంఎల్‌డీ వాటర్‌ను తయారు చేస్తున్నారు. దీనికి ఆలమ్, క్లోరినేషన్, ఫిల్టర్‌బెడ్ తదితర ప్రక్రియలు పూర్తిచేసి ప్రజలకు సరఫరా చేయడానికి నగరపాలక సంస్థకు ఏడాదికి రూ.20 కోట్లు ఖర్చవుతుంది. నగరపాలక సంస్థకు నీటి చార్జీల రూపేణా వచ్చే ఆదాయం రూ.12 కోట్లు .నగరంలో ప్రతి వ్యక్తికి సగటున రోజుకు 130 లీటర్ల తాగునీరు సరఫరా చేస్తున్నారు. నగరపరిధిలో రెండు పూటల తాగునీరందిస్తున్నారు. నగర శివారు ప్రాంతాల్లో మాత్రం నేటికీ తాగునీటి ఎద్దడి కనిపిస్తుంది.

కొవ్వూరుకు బోరు నీరే ఆధారం

కొవ్వూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : అఖండ గౌతమి గోదావరి కొవ్వూరు పట్టణాన్ని ఆనుకుని ఉంది. ఎక్కడో మహారాష్ట్రలోని నాసిక్ వద్ద పుట్టిన గోదావరి నది వేల కిలోమీటర్లు ప్రవహించి కొవ్వూరు చేరుకుంటుంది. ఇక్కడ నుంచి అఖండ గోదావరి ఏడుపాయలు గా విడిపోయి ఉభయ గోదావరి జిల్లాల్లోని లక్షలాది ఎకరాలకు సాగునీరు, లక్షలాది మందికి తాగునీటిని అందిస్తూ ఎంతో మంది అవసరాలు తీరుస్తుంది. అయితే పాలకులు అఖండ గోదావరి ఒడ్డున ఉన్న కొవ్వూరు తీరాన్ని మాత్రం మర్చిపోయారు.కొవ్వూరు నియోజకవర్గం ఏర్పడి 6 దశాబ్దాలు దాటుతున్నా నేటికి పట్టించుకున్న పాలకులు లేరు. దీంతో వేసవి వచ్చిందంటే ప్రజలు గుక్కెడు నీటికి ఇక్కట్లు పడుతూనే ఉన్నారు. కొవ్వూరు పట్టణంలో సుమారు 50 వేలకు పైగా జనాభా ఉన్నారు. నియోజకవర్గంలో 53,000 ఎకరాల సాగుభూమి ఉంది. గోదారి చెంతనే ఉన్నా తాగు, సాగు నీటికి బోరు నీరే ఆధారం. కొవ్వూరు పట్టణంలో 12,569 గృహాలు, 50 వేలకు పైగా జనాభా ఉన్నారు. వీరికి పురపాలక సంఘం ప్రతి రోజు రెండుపూటలా పట్టణంలో 4.5 ఎంఎల్‌డీ తాగునీటిని సరఫరా చేస్తుంది. ఒక్కొక్క పూటకు 22.50 లక్షల లీటర్ల నీటిని సరఫరా చేస్తున్నారు. పట్టణంలో కుళాయి పన్నుల రూపంలో మునిసిపాలిటీకి రూ.57 లక్షలు ఆదాయం వస్తుండగా ప్రజలకు తాగునీరందించడానికి ఏడాదికి సుమారు రూ. 2.03 కోట్లు ఖర్చు చేస్తున్నారు. వేసవిలో 15వ వార్డు బ్రిడ్జిపేట, ఒకటో వార్డు ఆర్టీసీ కాలనీలతో పాటు ఇటీవల వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన జగనన్న కాలనీలకు తాగునీటి ఎద్దడి తప్పడం లేదు. దీంతో మునిసిపల్ వాటర్ ట్యాంకుతో పాటు, 4 ట్యాంకర్లను అద్దెకు తీసుకుని పట్టణంలోని 4 జగనన్నకాలనీలకు నీటిని సరఫరా చేస్తున్నారు. కొత్త ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణంతో ఏఐబీ పథకంలో చేపట్టిన తాగునీటి పథకాన్ని పూర్తిచేస్తే తాగునీటి సమస్య తీరుతుంది.



కొవ్వూరు 1వ వార్డుకు ట్యాంకర్ల ద్వారా నీరు

గోదావరి నీరు సరఫరాకు చర్యలు

కొవ్వూరు పట్టణ ప్రజలకు గోదావరి జలాలను అందించేందుకు రూ.58 కోట్లతో పనులు చేపట్టాం.బిల్లులు మంజూరుకాకపోవడంతో కాంట్రాక్టర్ పనులు మధ్యలోనే నిలుపుదల చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం పెరిగిన ధరలు రూ. 70 కోట్లతో ప్రతిపాదనలు తయారుచేసి ప్రభుత్వానికి పంపించడం జరిగింది. పరిపాలన అనుమతులు మంజూరయ్యాయి.టెండర్లు పూర్తయిన వెంటనే పనులు ప్రారంభిస్తాం.

- టి.నాగేంద్రకుమార్,కమిషనర్, కొవ్వూరు

తాగునీటికి రోడ్డెక్కారు!

దేవరపల్లి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : తాగు నీరివ్వాలని రోడ్డెక్కారు.. ఆందోళన చేశారు. దేవర పల్లిలో ఇందిరమ్మ కాలనీకి గత వారం రోజు లుగా నీరందకపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.దీంతో ఆదివారం మహిళలు భారీ ఎత్తున రోడ్డు పైకి వచ్చి ఖాళీ బిందెలతో నిరసన చేపట్టారు. వీరికి మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు సుంకర దుర్గారావు మ ద్దతుగా నిలిచి పంచాయతీ అధికారులను నిల దీశారు.దేవరపల్లి మండలంలో తాగునీటికి ఎప్పు డు సమస్యలేదని.. ఇందిరమ్మ కాలనీలో 40 వేల లీటర్ల వాటర్ ట్యాంకు ఉందని తెలిపారు. కావాలని నీటి సమస్య సృష్టిస్తున్నారని ఆరోపిం చారు.ఎస్‌ఐ సుబ్రహ్మణ్యం సంఘ టన ప్రాంతానికి చేరుకుని కాలనీవాసులకు నచ్చ జెప్పారు.తాగునీరు సక్రమంగా సరఫరా చే యా లని కార్యదర్శి ఎస్.రవికిషోర్‌కు సూచించారు.



27న ఉపసర్పంచ్‌ల ఎన్నిక

- 35 పంచాయతీల్లో ఖాళీలు
- ఉమ్మడి జిల్లాలో ఇదీ లెక్క
- పల్లెల్లో ఎన్నికల సందడి

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)
మళ్లీ ఎన్నికల సందడి మొదలైంది. స్థానిక సంస్థల ఎన్నిక జరిగి నాలుగేళ్లు పూర్తికావడంతో పలు చోట్ల అభ్యర్థుల మార్పులు అవిశ్వాస తీర్మానాలు ఆరంభంకానున్నాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు డివిజన్లలో మొత్తం 35 పంచాయతీల్లో ఖాళీ అయిన ఉపసర్పంచ్ పదవులకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఆయా పంచాయతీల పరిధిలోని వార్డు సభ్యులకు నోటీసులు ఇచ్చారు. 27న ఈవోపీఆర్‌డీ ఎన్నికల అధికారిగా ఆయా పంచాయతీల్లో ఎన్నికలు నిర్వహిస్తారు.కూటమి అధికారంలోకి ఉండడంతో ఉపసర్పంచ్ పదవులు కైవశంచేసుకోవాలనే వ్యూహంతో వ్యవహరిస్తోంది.

- తూర్పుగోదావరి జిల్లాలో 12 ఉపసర్పంచ్ పదవులకు ఎన్నికలు జరగనున్నాయి.గోకవరం మండలం మల్లవరం, కొవ్వూరు మండలం పెనకనమెట్ట, రాజానగరం మండలం పాతతుంగపాడు, గోపాలపురం మండలం కొవ్వూరుపాడు,గోపాలపురం,వెంకటాయపాలెం, తాళ్ళపూడి మండలం తాడిపూడి, అనపర్తి మండలం లక్ష్మీనరసాపురం,రంగంపేట మండలం మర్రిపూడి, కడియం మండలం మురమండ,సీతానగరం మండలం మునికూడలి,ఉండ్రాజవరం గ్రామాల్లో ఉపసర్పంచ్ ఎన్నికలు జరుగనున్నాయి.
- డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఆత్రేయపురం మండలం పులిదిండి, రాయవరం మండలం వెదురుపాక, రాయవరం, ఐ.పోలవరం మండలంలో జి.మూలపొలం,ముమ్మిడివరం మండలం సిహెచ్.గున్నేపల్లి, రాజోలు మండలం సోంపల్లి, శివకోటి, ఆలమూరు మండలం మొదుకూరు, కొత్తపేట మండలం కొత్తపేట, పలివెల, మలికిపురం మండలం లక్కవరం,చింతలమోరి, సఖినేటిపల్లి మండలంలో మోరిపాడు, అంతర్వేదిపాలెం, అంబాజీపేట మండలంలో మాచవరం, అల్లవరం మండలంలో ఎంట్రికోన, అయినవిల్లి మండలంలో బోతుకుర్రు, రామచంద్రపురం మండలం నెలపర్తిపాడు పంచాయతీల్లో ఉపసర్పంచ్ పదవులకు ఎన్నికలు జరుగనున్నాయి.
- కాకినాడ జిల్లాలో పెదపాడు మండలం రామేశ్వరం,తుని పరిధిలో దొండవాక,సామర్లకోట మండలం బి.వేమవరం, తొండంగి మండలం పైడికొండ,ప్రత్తిపాడు మండలం పెదశంకర్లపూడి పంచాయతీల పరిధిలో ఉపసర్పంచ్ ఎన్నికలు జరుగనున్నాయి.

నేటి నుంచి పొగాకు కొనుగోళ్లు ప్రారంభం

దేవరపల్లి,మార్చి 23 (ఆంధ్రజ్యోతి): దేవరపల్లి పొగాకు వేలం కేంద్రంలో పొగాకు కొనుగోళ్లు సోమవారం ప్రారంభిస్తున్నట్లు దేవరపల్లి పొగాకుబోర్డు వేలం నిర్వహణాధికారి హేమస్మిత ఆదివారం తెలిపారు. పొగాకు బోర్డు ఈడీ బీ.విశ్వశ్రీ పొగాకు కొనుగోళ్లు ప్రారంభిస్తారని తెలిపారు.గతేడాది లైట్‌శాయిల్ 3038, బ్లాక్ శాయిల్ రైతులు 1059 మంది ఉన్నారని లైట్‌శాయిల్ పొగాకు రూ.390 పలకగా, లైట్‌శాయిల్ పొగాకు రూ.401 అత్యధిక ధర పలికిందన్నారు.



సరాసరి ధర రూ.315 పలి కినట్టు తెలిపారు. ఈ ఏడాది పొగాకు ధరలు ఆశాజనకంగా ఉందన్నారు. మొదటి రోజైన సోమవారం చెరుకుమిల్లి గ్రామానికి చెందిన రైతులు 27 బేళ్ళు అమ్మకానికి పెడతారని తెలిపారు. రైతులంతా ప్రారంభోత్సవానికి రావాలన్నారు.

వేస్ట్ కాదు సుమా!





ఈ నెల 8న కాపవరంలో పరిశీలించిన మంత్రి నారాయణ

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)
ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా అనేక మునిసిపాలిటీల్లో వందల టన్నుల చెత్త సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా కూటమి ప్రభుత్వం సరికొత్త అడుగులు వేస్తోంది. నిత్యం వచ్చే వందల టన్నుల చెత్తను ఒక చోటకు చేర్చి దీని నుంచి విద్యుదుత్పత్తి చేసే ప్రాజెక్టుకు రూపకల్పన చేస్తోంది..అటు జనానికి చెత్త సమస్య తీర్చడం..ఇటు కొండల్లా పోగయ్యే చెత్తను కనుమరుగు చేసి ప్రజలకు ఉపయోగపడేలా విద్యుదుత్పత్తి చేసేలా రూ.370 కోట్లతో చెత్త నుంచి విద్యుత్ తయారీ యూనిట్ నెలకొల్పబోతోంది. కాకినాడ-రాజమహేంద్రవరం క్లస్టర్‌లో దీని ఏర్పాటుకు వీలుగా ప్రైవేటు సంస్థలను ఆహ్వానించింది. అనపర్తి నియోజకవర్గంలోని బిక్కవోలు మండలం కాపవరం, బలభద్రపురంలో గ్రామాల్లో ప్రాజెక్టుకు స్థలాలు గుర్తించడంతో ఇప్పుడు కొత్త సమస్య వచ్చి పడింది. ఇప్పటికే ఇక్కడ జనం గ్రాసిం కంపెనీ కాలుష్యంతో ఇబ్బంది పడుతుంటే చెత్తంతా ఇక్కడకు తేవడం సరికాదని స్థానిక ఎమ్మెల్యే నల్లమిల్లి, అటు జనం వ్యతిరేకిస్తున్నారు. పెద్దాపురంలో స్థలం అనువుగా ఉన్నా ఎందుకు ఇక్కడే అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రోజుకు 950 టన్నుల చెత్త..

ఉమ్మడి తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాల్లో 22 కార్పొరేషన్లు, మునిసిపాలిటీలను కలిపి కాకినాడ- రాజమహేంద్రవరం క్లస్టర్‌గా ప్రభుత్వం ప్రతిపాదించింది. కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల్లో కార్పొరేషన్లు, మునిసిపాలిటీలు 12 ఉన్నాయి. ఉభయ గోదావరి జిల్లాల్లో కలిపి రోజుకు 950 టన్నుల చెత్త ఉత్పత్తి అవుతుంది.అత్యధికంగా ఉమ్మడి తూర్పు నుంచి ఉత్పత్తి అవుతుంది. కాకినాడ కార్పొరేషన్‌లో రోజుకు 144 టన్నులు, రాజమహేంద్రవరం కార్పొరేషన్ 160, పిఠాపురం 26, పెద్దాపురం 25, సామర్లకోట 23, రామచంద్రపురం 23, మండపేట 26, ముమ్మిడివరం 11,అమలాపురం మునిసిపాలిటీలో 30,కొవ్వూరు, నిడదవోలు మునిసిపాలిటీల పరిధిలో టన్నుల కొద్దీ చెత్త రోజువారీ వస్తోంది.ఈ చెత్తం టినీ ఒక చోట చేరిస్తే రోజుకు 12 మెగా వాట్ల విద్యుదుత్పత్తి చేయవచ్చని అధికారులు తేల్చారు.

ప్లాంట్ ఖర్చంతా ప్రైవేటుదే..

12 మెగావాట్ల విద్యుదుత్పత్తి ప్లాంట్‌కు రూ. 370 కోట్ల వరకు ఖర్చవుతుంది. ఒక్క పైసా పెట్టుబడి పెట్టకుండా ప్రైవేటు కంపెనీయే భరించేలా ఇటీవల ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.ఈ మేరకు టెండర్లు పిలిచింది. ఎంపికైన సంస్థ ఈ మొత్తం భరిస్తే ప్రభుత్వం తరపున చెత్త ఇవ్వడం, ఉత్పత్తయిన విద్యుత్ 25 ఏళ్ల పాటు సదరు కంపెనీయే సొంతంగా విక్రయించుకునే వెసులుబాటు కల్పించింది. ప్రభుత్వానికి ఏ మాత్రం భారం లేకుండా రెండు కార్పొరేషన్లు, 10 మునిసిపాలిటీల్లో చెత్తంతా బయటకు వెళ్లిపోనుంది.ఈ ప్రాజెక్టు ఆరంభమైతే 22 కార్పొరేషన్లు, మునిసి పాలిటీల్లో చెత్త సమస్యకు చెక్ పడనుంది.ఈ ప్రాజెక్టుకు అనపర్తి నియోజకవర్గం బిక్కవోలు మండలం కాపవరంలో 12 ఎకరాలు,బలభద్రపురంలో 20 ఎకరాలను అధికారులు ఎంపిక చేశారు.12 ఎకరాల్లో విద్యుత్ ప్లాంట్, 20 ఎకరాల్లో చెత్తంతా వేసి విద్యుదుత్పత్తికి అనువుగా మార్చడం చేయనున్నారు.ఈ నెల 8న మునిసిపల్ శాఖ మంత్రి నారాయణ కూడా ఆ ప్రాంతాన్ని పరిశీలించారు.

చెత్తతో విద్యుత్ వెలుగు

- చెత్త నుంచి విద్యుదుత్పత్తి
- రూ.370 కోట్లతో ప్లాంట్
- బిక్కవోలులో ఏర్పాటుకు ఓకే
- టెండర్లు పిలిచిన సర్కారు
- ప్రైవేటు భాగస్వామ్యంతో నిర్వహణ
- 22 మునిసిపాలిటీల నుంచి చెత్త
- ఉభయగోదావరి జిల్లాలకు ఇక్కడే
- రోజుకు 950 టన్నులు
- 12 మెగావాట్ల విద్యుదుత్పత్తి
- ప్రజల తీవ్ర అభ్యంతరం
- గ్రాసిం పరిశ్రమతోనే ఇబ్బందులు

ప్రాజెక్టుపై వ్యతిరేకత..

ప్రతిపాదిత ప్రాజెక్టు ప్రదేశంపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి.కాపవరం, బలభద్రపురం గ్రామాల్లో 22 కార్పొరేషన్లు, మునిసిపాలిటీల నుంచి తెచ్చిన చెత్తంతా వేస్తే జనం ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతింటుందని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. నిత్యం ఊరు చుట్టూ వందల్లో చెత్త లారీలు తిరిగితే జనం ఇబ్బందులు పడతారని అంటున్నారు. ఇప్పటికే గ్రాసిం పరిశ్రమ కాలుష్యంతో నరక యాతన పడుతున్న జనానికి ఇది మరో ముప్పు అని ధ్వజమెత్తుతున్నారు. అటు చెత్త నుంచి విద్యుదుత్పత్తి ప్లాంట్ ఏర్పాటు చేయవద్దంటూ కాపవరం, బలభద్రపురం పంచాయతీలు సైతం ఏకగ్రీవ తీర్మానం చేశాయి. ఈ ప్రాజెక్టుకు అనువైన భూమి పెద్దాపురంలో గుర్తించిన అధికారులు మళ్లీ బిక్కవోలు వైపు చూడడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కాపవరం,బలభద్రపురానికి సమీపంలో చెత్త నుంచి తయారయ్యే విద్యుత్ గ్రిడ్‌కు అనుసంధానించుకునేలా విద్యుత్‌లైన్ ఉండడం వల్ల మొగ్గుచూపుతున్నట్టు అధికారులు చెబుతున్నారు.

దివిసీమ యాత్రకు ఆర్టీసీ స్పెషల్ సర్వీసు


బస్సును ప్రారంభిస్తున్న డిపో మేనేజర్ కుమార్

కొవ్వూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు ఆర్టీసీ డిపో నుంచి కృష్ణా సాగర సంగమం దివిసీమ యాత్రకు స్పెషల్ బస్సును ఆదివారం డిపో మేనేజర్ వైవీవీఎస్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 27వ తేదీ, ఏప్రిల్ 1 న బస్సును నడుపుతామన్నారు. అలాగే ఏప్రిల్ 2వ తేదీన పంచ భూత లింగ సహిత రామేశ్వర యాత్ర స్పెషల్ బస్సు కొవ్వూరు డిపో నుంచి బయలుదేరుతుందన్నారు. ఈ యాత్ర ఏడు రోజులు పడుతుందన్నారు. టికెట్ ధర ఒక్కొక్కరికి రూ. 8150గా నిర్ణయించామన్నారు. ఇందులో ఉదయం, రాత్రి టిఫిన్, మధ్యాహ్నం భోజనం ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ టికెట్లు కావాల్సినవారు 9100954631 నెంబర్‌ను సంప్రదించాలన్నారు. 2024-25 సంవత్సరంలో యాత్ర స్పెషల్ పేరుతో కొవ్వూరు డిపో నుంచి ప్రత్యేకంగా 124 బస్సులను పంపించామన్నారు. డిపోకు రూ. 48,57,370 ఆదాయం వచ్చిందన్నారు.

వైభవంగా వెంకన్న బ్రహ్మోత్సవాలు ప్రారంభం


ప్రత్యేక అలంకరణలో స్వామివారు

కొవ్వూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బసివిరెడ్డిపేటలో వేంచేసియున్న శ్రీరాజ్యలక్ష్మీ గోదాసమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా ఆదివారం ప్రారంభించారు. ఆలయ అర్చకుడు గొడవర్తి వేణుగోపాలచార్యులు పర్యవేక్షణలో ఆలయ కమిటీ చైర్మన్ దేవగుప్తాపు లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఈ నెల 23వ తేదీ నుంచి 28 వరకు స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగుతాయన్నారు. ఆదివారం సాయంత్రం ఆరాధన, విష్వక్సేనపూజ, పుణ్యహవచనము, రక్షాబంధనము, ఋత్విక్ వరుణం, అంకురారోపణ, యాగశాల ప్రవేశం, గరుడపత ఆదివాసము, నివేదన తీర్థప్రసాద గోష్టి నిర్వహించారు. కార్యక్రమంలో వేదపండితులు, పట్టణ పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

'మహిళా అక్షరాస్యతతోనే దేశాభివృద్ధి'


చాగల్లులో పరీక్ష రాస్తున్న స్వయం సహాయక సంఘాల మహిళలు

చాగల్లు, మార్చి23 (ఆంధ్రజ్యోతి): మహిళా అక్షరాస్యతతోనే దేశాభివృద్ధి జరుగుతుందని ఎంపీడీవో ఆర్.శ్రీదేవి అన్నారు. కేంద్ర ప్రభుత్వం అక్షరాస్యులు కానివారి కోసం ఉల్లాస్ అనే పథకాన్ని ప్రవేశపెట్టి చదవడం, రాయడం నేర్పించడం లక్ష్యంగా మండలం నుంచి 800 మంది స్వయం సహాయక సంఘం సభ్యులను ఎంపిక చేసి వారికి 80 మంది వలంటీర్లు సహాయంతో సుమారు రెండు సంవత్సరాల పాటు చదవడం, రాయడం నేర్పించారు. వారికి ఆదివారం నెలటూరు ప్రాథమిక పాఠశాల సహా పలుచోట్ల పరీక్షలు నిర్వహించారు. ఈ కేంద్రాలను ఎంపీడీవోతో పాటు మండల టీడీపీ అధ్యక్షుడు నాదెళ్ల శ్రీరామ్ చౌదరి ఆదివారం పరిశీలించారు. వీరితోపాటు అధికారులు, తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో నీటిఎద్దడి లేకుండా చూడండి

• అధికారులకు మంత్రి కందుల దుర్గేష్ ఆదేశం


పెరవలి సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్, హాజరైన తదితర ప్రజా ప్రతినిధులు

పెరవలి, మార్చి23 (ఆంధ్రజ్యోతి): వేసవి కాలంలో అన్నిగ్రామాల్లో నీటిఎద్దడి లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మంత్రి దుర్గేష్ ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆదివారం మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం జరిగింది. దీనికి ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ గ్రామంలో ఇబ్బంది ఎదురైనప్పటికీ వెంటనే గ్రామస్థాయి, మండల స్థాయి అధికారులు దృష్టికి తీసుకొచ్చి వెంటనే పరిష్కారానికి చొరవచూపాలన్నారు. ప్రస్తుతం భూగర్భ జలాలు తక్కువగా ఉన్నందున రైతులతో పాటు సాధారణ ప్రజానీకం కూడా జలాలను సద్వినియోగించు కోవాలన్నారు. ఈ సందర్భంగా క్షయ వ్యాధి లేని గ్రామాలకు ఆయన ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ వంక రవీంద్ర, కార్చెర్ల ప్రసాద్, ఎంపీడీవో వెంకటరమణ, ఆయాశాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

• 52 రోడ్ల నిర్మాణాలు పూర్తి

ఉండ్రాజవరం: మండలంలో రూ. మూడు కోట్లతో 52 రోడ్ల నిర్మాణాలు పూర్తి చేసినట్టు పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. ఆదివారం ఎంపీపీ పాలాటి యల్లారీశ్వరి అధ్యక్షతన జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో ఈ పనులు పూర్తి చేశామన్నారు. నియోజవర్గస్థాయిలో రూ.12 కోట్లు నిధులు వచ్చాయన్నారు. పసలపూడికి 11 కిలోమీటర్ల దూరం నుంచి విద్యుత్‌లైన్ వస్తున్నందున గ్రామంలో విద్యుత్‌సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని తన దృష్టికి వచ్చిందని మంత్రి చెప్పారు. దీనిపై ఏఈ మాట్లాడుతూ సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థలసేకరణ జరిగిందని, సాయిల్ టెస్ట్‌కు పంపించామని సమాధానమిచ్చారు. ఉండ్రాజవరంలో పశువుల ఆసుపత్రి భవనం శిథిలావస్థలో ఉందని, నిర్మాణం చేపట్టాలని ఎంపీటీసీ సుబ్బారావు మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. అనంతరం వివిధ శాఖలను పనితీరును సమీక్షించారు. జడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య, వైస్ ఎంపీపీలు చెట్టే నవీన్, ఎన్. సరోజిని, తహశీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్, ఎంపీడీవో వీఎస్ రామారావు, ఈవోపీ ఆర్డీకే ఆంజనేయశర్మ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


ఉండ్రాజవరంలో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్

నేడు మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం

కొవ్వూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూరు పురపాలక సంఘం అత్యవసర సమావేశం సోమవారం మధ్యాహ్నం మూడు గంటలకు నిర్వహిస్తున్నట్టు కిమిషనర్ టీ. నాగేంద్రకుమార్ తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ భావన రత్నకుమారి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు హాజరుకావాలన్నారు.

రైతులకు ఉచిత వైద్యపరీక్షలు



హెల్త్ క్యాంపులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు లిటరరీ క్లబ్ కల్యాణ మండపంలో ఆదివారం గ్రూనర్ ఫౌండేషన్, కిసాన్ ఉర్జా లిమిటెడ్ నోయిడా వారి సౌజన్యంతో రైతులకు ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. దీన్ని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ప్రారంభించారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, మద్దిపట్ల శివరామకృష్ణ, పరిమి హరిచరణ్ పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ కార్డుల పంపిణీ


నడిపల్లిలో కార్డులు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

పెరవలి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో టీడీపీ సభ్యత్వ కార్డులను అన్నిగ్రామాల్లో ముమ్మరంగా పంపిణీ చేస్తున్నట్టు టీడీపీ మండల అధ్యక్షుడు అతికాల రామకృష్ణమ్మ పేర్కొన్నారు. గతంలో పార్టీ ఆదేశాల మేరకు అన్నిగ్రామాల్లో విస్తృతంగా సభ్యత్వాలు సేకరించడం జరిగిందని, ప్రస్తుతం బూత్‌ల వారీగా ఆయాగ్రామాల్లోని కార్యకర్తలకు కార్డులను అందజేస్తామన్నారు.

నేడు పొగాకు వేలం పాట కేంద్రం ప్రారంభం

గోపాలపురం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం పాట కేంద్రాన్ని సోమవారం ప్రారంభిస్తున్నట్టు పొగాకు బోర్డు రైతుసంఘం అధ్యక్షుడు అమల్‌డి శ్యామ్ తెలిపారు. మొదటిరోజు 27బేళ్లను కొనుగోలు చేస్తున్నట్టు తెలిపారు. దీనికి పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విశ్వశ్రీ హాజరవుతారని చెప్పారు. సకాలంలో రైతులు వచ్చి కార్యక్రమంలో పాల్గొనాల్సిందిగా ఆయన కోరారు.

ఎమ్మార్పీకే మద్యం అమ్మాలి


మద్యం షాపు ఎదుట ఆందోళన చేస్తున్న టీడీపీ నేత అనిల్, తదితరులు

దేవరపల్లి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): దేవరపల్లిలో మద్యం షాపుల్లో ప్రభుత్వ ధర కంటే బాటిల్‌పై రూ.10 అదనంగా వసూలు చేస్తున్నారని , వెంటనే అధికారులు చర్యలు తీసుకోవాలని మండల టీడీపీ అధ్యక్షుడు అంద్రూ అనిల్ డిమాండ్ చేశారు. షాప్ నెంబర్ 45 వద్ద ఆదివారం అధికంగా రూ. 10 వసూలు చేస్తున్నారన్న సమాచారం రావడంతో అనిల్ ఆధ్వర్యంలో పలువురు వెళ్లి ఆందోళన నిర్వహించారు. గతంలో కూడా ఎక్సైజ్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. దీనిపై ఎక్సైజ్ శాఖ అధికారులకు ఫోన్‌చేసినా స్పందించకపోవడం దారుణమని విమర్శించారు. గంట సేపు షాపుషట్టర్‌ను కిందకు దింపి నిరసన వ్యక్తం చేశారు.

పెట్రోలు బంకు వద్ద ఆందోళన

దేవరపల్లి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): దేవరపల్లి - గోపాలపురం రోడ్డులో ఉన్న పెట్రోల్‌బంకు వద్ద స్థానికులు సుంకర దుర్గారావు, యాగంటి సాయిబాబు ఆధ్వర్యంలో ఆదివారం ఆందోళన చేపట్టారు. బంకులో స్టాక్ రిజిస్టర్ డిస్‌ప్లే బోర్డు పెట్టడం లేదని, డెన్సిటీ సరిగా ఉందా లేదా అనేది చెప్పాలని డిమాండ్ చేశారు. ఎస్‌ఐ వీసుబ్రహ్మణ్యం సంఘటనా స్థలానికి వచ్చి పెట్రోల్, డీజిల్ శాంపిల్స్ పంపిస్తామని, ఏమైనా సమస్యలుంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలపటంతో వారు ఆందోళన విరమింపజేశారు. స్థానికులు మెరిపో ఆదియ్య, యాగంటి సుబ్రహ్మణ్యం, ఓరుగంటి రామరాజు, గద్దే యశ్వంత్ పాల్గొన్నారు.


పెట్రోలు బంకు వద్ద ఆందోళన చేస్తున్న స్థానికులు

వెంకన్న ఆలయంలో పూజలు

ఉండ్రాజవరం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): వెలగదుర్రు వెంకటేశ్వరస్వామివారి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. తొలుత నగర సంకీర్తన జరిగింది. అనంతరం భజన కార్యక్రమాలు నిర్వహించి, భక్తులకు ప్రసాదాన్ని అందజేశారు. స్థానికులు పాల్గొన్నారు.

కోటసత్తెమ్మకి ప్రత్యేక అలంకరణ

ఉండ్రాజవరం / నిడదవోలు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): తిమ్మరాజుపాలెంలో వేంచేసిన కోటసత్తెమ్మకి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం కమిటీ సభ్యులచే ఆదాయం లెక్కించగా, రూ. 1,43,757 వచ్చినట్లు కార్యనిర్వహణాధికారి వీ. హరిసూర్యప్రకాష్ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ దేవులపల్లి రవిశంకర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పొగాకు బోర్డు రైతు సంఘం ఎన్నిక ఏకగ్రీవం

దేవరపల్లి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): దేవరపల్లి పొగాకు బోర్డు రైతుసంఘం ఎన్నిక ఏకగ్రీవమైనట్టు కాట్రు వీరవెంకట సత్యనారాయణ తెలిపారు. అధ్యక్షుడిగా కాట్రు వీర వెంకటసత్యనారాయణ,ఉపాధ్యక్షుడిగా బిక్కిన నాగరాజు, కార్యదర్శిగా దుద్దుపూడి హరిబాబు, సహాయకార్యదర్శిగా జనపరెడ్డి వెంకట్రావు, ట్రెజరర్‌గా ఆచంట సత్యనారాయణ, సలహాదారులుగా నరహరశెట్టి రాజేంద్రబాబు, ఆచంట గోపాలకృష్ణ, పరిమి శ్రీరామకృష్ణ, మరో 14 మంది సభ్యులుగా ఎన్నుకోబడ్డారు.

కండక్టర్ ప్రసాదరావుకు మరో మూడు పురస్కారాలు

గోపాలపురం, మార్చి23 (ఆంధ్రజ్యోతి): బహుముఖ ప్రజ్ఞాశాలి, కండక్టర్ డాక్టర్ కౌలూరి ప్రసాదరావుకి మరో మూడు కథా పురస్కారాలు వరించాయి. విజయవాడ కేబీఎన్ కళాశాలలో ఉషాపత్రికల బహుమతుల పండుగ ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ పోటీల్లో గెలుపొందిన రచయితలను ఘనంగా సన్మానించారు.

12న పురస్కారాల ప్రదానం

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): దేశానికి దిశానిర్దేశం చేసిన మహనీయులు మహాత్మా జ్యోతిరావు పూలే, బీఆర్ అంబేడ్కర్‌ల పేరిట ఇద్దరు నేతలకు పురస్కారాలను వచ్చేనెల 12న రాజమహేంద్రవరంలో ప్రదానం చేయనున్నట్టు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు సానబోయిన రామారావు, వైస్ చైర్మన్ ఎల్‌వీ ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు బద్దే జార్జి ఆంటోని తెలిపారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. 12న స్థానిక చెరుకూరి కళ్యాణ మండపంలో జరిగే సభలో పూలే పురస్కారాన్ని మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావుకు, అంబేడ్కర్ పురస్కారాన్ని రాష్ట్ర దళిత సేన అధ్యక్షుడు జేబీ రాజుకు అందిస్తామన్నారు.

పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట : ఎమ్మెల్యే


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : పేద, మధ్య తరగతి ప్రజల ఆరోగ్యానికి రాష్ట్రప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం కొవ్వూరు నియోజకవర్గంలో మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. మొత్తం నలుగురికి రూ. 2,28,398 అందజేశారు. పట్టణంలోని లాగుడు రాజబాబుకు రూ. 24,140, సకుమళ్ల కుమారికి రూ. 1,43,062, కర్రి గుణదీపికకు రూ. 27,501, చిత్రాడ లక్ష్మీమౌనికకు రూ. 33,695 మంజూరయ్యాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అనారోగ్యానికి గురై ఎన్టీఆర్ వైద్యసేవలో కవర్ కాని ప్రైవేటు ఆసుపత్రులలో వైద్యం చేయించుకుని ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నవారిని ఆదుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యుడు కంటమణి రామకృష్ణారావు, మద్దిపట్ల శివరామకృష్ణ, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, బీవీ ముత్యాలరావు, దాయన రామకృష్ణ, పెనుమాక జయరాజు, బర్ల శ్రీనివాస్, బొబ్బిలి పేర్రాజు, కాకర్ల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నిర్మలగిరి ఉత్సవాలకు పోటెత్తిన భక్తులు


మేరీమాత మందిరం వద్ద ప్రార్థనలు చేస్తున్న భక్తులు

దేవరపల్లి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): నిర్మలగిరి పుణ్యక్షేత్ర మేరీమాత మహోత్సవాలకు ఆదివారం భక్తులు పోటెత్తారు.మందిరం వద్ద భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పవిత్ర దినం కావడంతో అధికసంఖ్యలో వచ్చారు. ఉదయం నుంచి ఆలయంలో దివ్యబలిపూజ, పరిశుద్ధ జపమాల, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రత్యేక నాటికలు, నిర్వహిం చారు. భక్తులకు అన్నిసౌకర్యాలు ఏర్పాటు చేసినట్టు జాన్‌పీటర్ తెలిపారు. జనం రద్దీ ఎక్కువగా ఉండటంతో ఇటు దేవరపల్లి నుంచి అటు పంగిడి నుంచి వాహనాలు మళ్లించారు.

'దోషులను వెంటనే అరెస్ట్ చేయాలి'



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న జనసేన పార్టీ కన్వీనర్ సువర్ణరాజు, తదితరులు

• జనసేన పార్టీ కన్వీనర్ సువర్ణరాజు

నల్లజర్ల, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): దూబచర్ల గాంధీ కాలనీలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేసి అవమానపర్చిన దోషులను గుర్తించి వెంటనే అరెస్ట్ చేయాలని గోపాలపురం నియోజకవర్గ జనసేన పార్టీ కన్వీనర్ దొడ్డిగర్ల సువర్ణరాజు డిమాండ్ చేశారు. ఆదివారం అంబేడ్కర్ విగ్రహానికి నిర్వహించాల్సిన పాలాభిషేకం కార్యక్రమం వాయిదా పడడంతో జనసేన నాయకులతో నల్లజర్ల పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి నిరసన తెలిపారు. అనంతరం ఎస్సై రమేష్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సువర్ణరాజు మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానపర్చిన దుండగులను కఠినంగా శిక్షించి, పాత విగ్రహం ప్రదేశంలో నూతన విగ్రహం ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. అనంతరం పలువురు మాట్లాడారు. అలాగే ముసుళ్ళకుంటలో స్వర్గీయ ఎన్టీ రామారావు విగ్రహానికి చెప్పుల దండ వేసి అవమానపర్చిన వారిపై సైతం కఠినచర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గోపాలపుం ఐటీ కో-ఆర్డినేటర్ ఉన్నమట్ల సత్య, కవులూరి సత్తిబాబు,వీరమహిళ తలారి సౌజన్య,రుద్ర శ్రీను, ఉన్నమట్ల రమేష్, కొత్తపల్లి హరిబాబు, జీ. వరుణ్, తలంశెట్టి శివప్రసాద్, శ్రీనివాస్, సురేష్, సూరిబోయిన నాగేశ్వరరావు, ఉన్నమట్ల సాయి, తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌కు ఘన నివాళి


భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాల వేసిన ఏఐఎస్ఎఫ్ నాయకులు

గోపాలపురం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): భగత్‌సింగ్ ఆశయాలను మనమంతా కొనసాగిద్దామని ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి చింతలపూడి సురేశ్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఉన్న భగత్‌సింగ్ విగ్రహానికి వర్ధంతి సందర్భంగా ఆదివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. వై.పెడ్రిక్, కడిమి శంకర్, చింతలపూడి సన్నీ, మల్లిపూడి వినయ్, తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు మండల సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ భాగ్యలక్ష్మి

ఉండ్రాజవరం/నిడదవోలు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): గోదావరి నదీపరీవాహక ప్రాంతాల్లో పుష్కరాలకు వచ్చే భక్తుల సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ తిరుమల భాగ్యలక్ష్మి అధికారులకు సూచించారు. సమిశ్రగూడెంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ భాగ్యలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పురుషోత్తపల్లి, పందలపర్రు, పెండ్యాల గ్రామా ల్లో పుష్కరాలకు వచ్చే భక్తుల కోసం స్నానాల రేవులు, ఆలయాలను అభివృద్ధి చేయాలన్నారు. వాటి కోసం ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు. రబీ సీజన్లో రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోల చేయాలని ఆమె తెలిపారు. వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు తగుచర్యలు తీసుకోవాలని చెప్పారు. వివిధ శాఖల పనితీరుపై సమీక్షించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, వైఎస్ ఎంపీపీలు కానుబోయిన ప్రభావతి, వడల రత్నకుమారి, ఎంపీడీవో లక్ష్మినారాయణ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

కల్లుగీత కార్మికుల మద్యం దుకాణాలపై..

వైసీపీ నాయకుల కన్ను

• వారి ఆర్థిక ఇబ్బందులే ఆసరాగా తీసుకొని టెండర్లు వేసినట్టు విశ్వసనీయ సమాచారం

• చక్రం తిప్పుతున్న కోమటిగుంటకి చెందిన వైసీపీ నేత

గోపాలపురం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): కల్లుగీత కార్మికుల సంక్షేమాభివృద్ధికి రాష్ట్రప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో భాగంగా మద్యం దుకాణాల్లో పదిశాతం వారికి కేటాయిస్తూ ఆన్‌లైన్‌లో టెండర్లను ఆహ్వానించింది. గత ప్రభుత్వం అవలంబించిన విధివిధానాలకు స్వస్తిపలికి నాణ్యమైన మద్యాన్ని తక్కువ ధరకే విక్రయించాలన్న సంకల్పంతో ఈ ప్రభుత్వం నూతన టెండర్లు పిలిచింది. అయితే క్షేత్రస్థాయిలో మాత్రం వైసీపీకి చెందిన వ్యక్తులు కల్లుగీత కార్మికుల ఆర్థిక ఇబ్బందులను ఆసరాగా చేసుకుని వారితో టెండర్లు వేయించి దేవరపల్లి, గోపాలపురం మండలాల్లో దుకాణాలను దక్కించుకున్నట్టు విశ్వసనీయ సమాచారం. దేవరపల్లి మండలంలో పదోనెంబర్, గోపాలపురం మండలంలో 11వ నెంబర్ దుకాణం కల్లుగీత కార్మికులకు దక్కాయి.అయితే అప్పట్లో టెండర్లు పిలిచిన సమయంలో నేరుగా అప్లికేషన్ ఇవ్వాల్సి ఉండగా వైసీపీనేతల కనుస న్నల్లో ఆన్‌లైన్ టెండర్లు వేయించారు. మద్యం దుకాణాలు నిజంగా కల్లుగీత కార్మికులకు దక్కినప్పటికీ, వాటి నిర్వహణ మాత్రం వైసీపీ నాయకులే నడిపిస్తున్నట్టు తెలుస్తోంది. ఇదే కోవలో గోపాలపురం మండలం కోమటికుంటకి చెందిన ఓ వ్యక్తి ఈ తతంగం మొత్తంలో చక్రం తిప్పుతున్నాడు. ఇదిలా ఉంటే ఈ దుకాణాల పరిధిలో ఉన్న గ్రామాల్లో వైసీపీ కార్యకర్తలతో దుకాణాలు ఏర్పాటు చేసి ఎంఆర్‌పీ ధర కంటే రూ.10 అదనంగా వసూలు చేస్తున్నట్టు గుసగుసలున్నాయి.

అనంతపల్లిలో ఉచిత వైద్యశిబిరం

నల్లజర్ల, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): అనంతపల్లిలో రాజమహేంద్రవరానికి చెందిన వేద ఆసుపత్రి యాజమాన్యం ఆదివారం ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటుచేశారు. ముందుగా శిబిరాన్ని మాజీ ఎంపీపీ జమ్ముల సతీష్ ప్రారంభించారు. డాక్టర్ తేజో ఫణీంద్ర (వెన్నెముక నిపుణులు) డాక్టర్ లక్ష్మీమృదుల వైద్యసేవ లు అందించారు. పౌష్టికాహారం తీసుకుంటే ఎముకలు దృఢంగా ఉంటాయని డాక్టర్ తేజో పేర్కొన్నారు. 120 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచిత మందులు అందించారు. కార్యక్రమంలో బళ్ల ప్రభాకర్ (నాని)ఎంపీడీవో సింహాద్రి రావు, సర్పంచ్ కమలకుమారి, వల్లిరెడ్డి సతీష్ పాల్గొన్నారు.